


### శ్రీకాళహస్తిలో ప్రారంభమైన ...

# లాన్ టెన్నిస్ పోటీలు

**క్రీడలకు ప్రాధాన్యత- క్రీడాకారులకు ప్రోత్సహం: శాప్ చైర్మన్**


లాన్ టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్

శ్రీకాళహస్తి,నవంబర్ 1 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రీడాకారులకు ఎనలేని ప్రాధాన్యత కల్పిస్తున్నారని అలాగే క్రీడలకు పుష్కలంగా నిధులు మంజూరు చేస్తున్నారని శాప్‌చైర్మెన్ అనిమిని రవినాయుడు అన్నారు. శనివారం ఇక్కడి ఎన్‌డికె నగర్‌లోని విక్రమ్ టెన్నిస్ అకాడమి సారథ్యంలో రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ పోటీలను ఏర్పాటు చేసారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ సారథ్యంలో నిర్వహిస్తున్న పోటీలను శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఇక్కడ పోటీల్లో 14సంవత్సరాల లోపు, 17,19 సంవత్సరాల లోపు బాల బాలికలకు పోటీలు నిర్వహించుటకు ప్రణాళికలు రూపొందించారు. ఈ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 300కు పైగా క్రీడాకారులు హాజరయ్యారు. జ్యోతి వెలిగించిప్రారంభించిన రవినాయుడు మాట్లాడుతూ నేడు యువ నాయకుడు మంత్రి నారాలోకేష్ పాఠశాల స్థాయి నుంచి చిన్నారుల్లో క్రీడల పట్ల మక్కువ పెంచుటకు తరగతులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.ఐదేళ్ల వైకాపా పాలనలో పట్టించుకోని స్టేడియంను తాము వచ్చిన వవెంటనే నిధులు కేటాయించి ప్రారంభించామని రవి వివరించారు. ఇక్కడ పోటీల్లో గెలుపొందిన వారు వచ్చేనెల న్యూఢిల్లిలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారని వివరించారు.ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిధులుగా ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ పెడరేషన్ కార్యదర్శి భానుమూర్తి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్, మాజీ శ్రీకాళహస్తి వనయవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు శ్రీకాళహస్తి రిపబ్లిక్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బిజె ప్రసాద్,మన్మధరావు విక్రమ్ ఆకాడమి చైర్మెన్ ప్రవీణ్ హాజరు కాగా కార్యక్రమాలను స్కూల్ గేమ్స్ కార్యదర్శి కిషోర్ కుమార్, భార్గవిలు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మెన్ రవి నాయుడును ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం నాయకులు ఆయన్ను పూల మాలలతో ముంచెత్తారు.

### అసంపూర్తిగా భవనాలు...

# అవస్థల్లో విద్యార్థులు!


అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

వెంకటగిరి, నవంబర్ 1 ప్రభాత వార్త: మండలంలోని పలు పాఠశాల భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో నాడు నేడు పథకం కింద ప్రతి జెడ్పి ఉన్నత పాఠశాలకు రూ.1 కోటి 20 లక్షల రూపాయలతో అమ్మపాలెం, జీకేపల్లి, పారవోలు, వలివేడు, వెంకటగిరి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఇంకా పలు గ్రామాలకు నూతన భవనాలు నిర్మించాల్సి ఉండగా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాడు నేడు పథకం కింద కొన్ని భవనాలలో ఎలక్ట్రికల్ పనులు, కాంపౌండ్, కిటికీలు, తలుపులు, టైల్స్, పెయింటింగ్ వర్క్స్ లాంటి ఇతర పనులు చేయకపోవడం వలన అసంపూర్తిగా నిర్మాణాలు ఉన్నాయి. అమ్మపాలెం లో వంటగది, టాయిలెట్స్, అదనపు భవనాలు పూర్తి కాకుండా నిలిచిపోయినట్లు హెచ్.ఎం. మారుతి ప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకు రూ.62 లక్షల 81 వేలు నిధులు వ్యయం చేసినట్లు హెచ్.ఎం. తెలిపారు. కాంపౌండ్, మిగిలిన ఆగిన పనులు ప్రభుత్వం చేయాల్సి ఉందని తెలిపారు. విద్యార్థులు అసంపూర్తిగా ఉన్న పాఠశాల గదులలోనే విద్యను అభ్యసిస్తున్నారని హెచ్.ఎం తెలిపారు. భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటి ప్రభుత్వమైన చొరవ తీసుకొని ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### విజిటేబుల్ క్లస్టర్ ప్రోగ్రామ్‌లో...

# నవయుగ ఆర్గానిక్ ఫ్రెష్ మార్ట్

**- నవయుగ గ్రూప్ చైర్మన్ వెంకటకృష్ణా రెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న నవయుగ హెల్త్ ఆర్గనైజషన్ నిర్వాహకులు

తిరుపతి హెల్త్, నవంబర్ 1 ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ హార్టికల్చర్ బోర్డు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హార్టికల్చర్ మిషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న విజిటేబుల్ క్లస్టర్ ప్రోగ్రామ్‌లో మన తిరుపతి నవయుగ హెల్త్ ఆర్గనైజషన్, చారిటబుల్ సంస్థ ఎంపిక కావడం చాలా గర్వకారణమని నవయుగ గ్రూప్ చైర్మన్ వెంకటకృష్ణా రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ క్లస్టర్ వల్ల తిరుపతి జిల్లాలోని 33 మండలాలలో వున్నా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మన జిల్లాలో మొట్ట మొదటి సారి 160 కోట్ల ప్రాజెక్ట్ రావడం చాలా చాలా అనందించవలసిన విషయమన్నారు. దీనిని ఒకే చోట ప్రారంభించ కుండా మన జిల్లాలో వున్న 8 అసెంబ్లీ నియోజకవర్గలలో సమానంగా మినీ క్లస్టర్స్ లాగా విభజించడం వల్ల అన్ని ప్రాంతాలలో వున్న వారికి ఎంతో మేలు జరుగుతుంది ఇందుకోసం ఒక్కొక్కటి 20 కోట్ల వ్యయంతో ప్రారంబించడం వల్ల అక్కడ వున్న 200 నుంచి 250 మంది స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయాన్నరు. కనీసం 2000 మంది రైతులకు వేల మంది కస్టమర్లకు మంచి ఆహారం లభిస్తుందన్నారు. తిరుపతి జిల్లాలోని 8 మినీ క్లస్టర్ నుండి నేరుగా తిరుపతిలో వున్న తిరుచనూర్ మాంగో యార్డ్ నందు గల ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ విహెచ్‌టి నందు మెగా క్లస్టర్ నందు శుద్ధి చేసి నేరుగా జిల్లా వ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులో ఉండేవిధంగా 100కు పైగా నవయుగ ఫ్రెష్ మార్ట్స్ ప్రారంభిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని మండలాల వారీగా వున్నా ఎఫ్‌పిఓ, పిఏసిఎస్, ఎంఏసిఎస్ సంస్థలు మాతో కలుపుకొని ఎంతోమంది రైతులకు ఆర్గానిక్ పద్ధతిలో పండించే విధంగా ప్రోత్సహించి వారికీ కావలసిన అన్ని ఇన్పుట్స్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గానిక్ ఫార్మర్, మాజీ ఏయిర్ ఫోర్స్ వెంకట రామరాజు, ఆర్గానిక్ ఫార్మర్స్ డెవలప్మెంట్ ఎఫ్‌టిఓ అధినేత గంగాధర్, ఆర్గానిక్ ఫార్మర్స్ డెవలప్మెంట్ ఎఫ్‌పిఓ అధినేత శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నేడు నింగిలోకి జిశాట్-7ఆర్

**- సజావుగా కౌంట్‌డౌన్-శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని, శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శించుకున్న ఇస్రో చైర్మన్**


జిశాట్-7ఆర్ (సిఎంఎస్03) ఉపగ్రహం

సూళ్లూరుపేట, నవంబర్ 1 ప్రభాతవార్త: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం అంతరిక్ష రంగంలో మరో చారిత్రాత్మకమైన ఘట్టానికి సిద్ధమైంది. అత్యంత బరువైన ఉపగ్రహాలను అవలీలగా కక్ష్యలోకి ప్రవేశపెట్టే సామర్థ్యం ఉన్న ఎల్‌విఎం3-ఎం5 రాకెట్ ద్వారా జిశాట్-7ఆర్ (సిఎంఎస్03) ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు. ఇందుకు సంబంధించి శనివారం సాయంత్రం 5 గంటల 26 నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 24 గంటల పాటు ఈ కౌంట్‌డౌన్ కొనసాగుతుంది. భారత భూభాగంలో విస్తృత సముద్ర ప్రాంతాల్లో పరిశోధన సమాచారం. సైనిక అవసరాల కోసం ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు. ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ఆధ్వర్యంలో ఇస్రో శాస్త్రవేత్తల బృందం ఈ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం సక్సెస్ అయితే పూర్తి స్వదేశీ సాంకేతికత సాధించిన విజయంగా ఇస్రో తన ఖాతాలో వేసుకుంటుంది. ఇస్రో చైర్మన్ శ్రీహరికోటకు చేరుకుని ప్రయోగానికి సంబంధించిన ప్రక్రియను ఇస్రో శాస్త్రవేత్తల బృందంతో కలిసి పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఇందుకు సంబంధించి ఎంఆర్‌ఆర్ (మిషన్ రెడినెస్ రివ్యూ) సమావేశం జరిగింది. షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్ ఆధ్వర్యంలో ల్యాబ్ సమావేశం నిర్వహించి ప్రయోగానికి పచ్చజెండా ఊపారు. ఆదివారం సాయంత్రం 5 గంటల 26 నిమిషాలకు 4,400 కేజీల బరువైన ఉపగ్రహాన్ని (సిఎంఎస్03) నింగిలోకి పంపనున్నారు. మూడు దశల్లో ప్రయోగం పూర్తవుతుంది. మొత్తం ప్రయోగం 16.09 నిమిషాల్లో పూర్తవుతుంది. 43.5 మీటర్ల పొడవు, 642 టన్నుల బరువు గల రాకెట్ 29వేల 970 కిలోమీటర్ల దూరంలోని జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి సిఎంఆర్03 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనున్నారు. అనంతరం హసన్‌లోని శాటిలైట్ మానిటరింగ్ సెంటర్ నుంచి ఉపగ్రహాన్ని 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి ఇస్రో శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టనున్నారు. అక్కడి నుంచి ఉపగ్రహం తన పని ప్రారంభించే విధంగా రూపకల్పన చేశారు.


శ్రీచెంగాళమాత పరమేశ్వరిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్

**శ్రీచెంగాళమ్మ సేవలో ఇస్రో చైర్మన్ నారాయణన్**

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ దర్శించుకున్నారు. ఆయన రాకెట్ ప్రయోగానికి ముందు ఆనవాయితీగా శ్రీచెంగాళమాత పరమేశ్వరిని దర్శించుకోవడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇస్రో చైర్మన్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వచ్చిన ఇస్రో చైర్మన్ బృందానికి దేవస్థానం కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్, పద్మశ్రీ, గణపతిభాయ్ పటేల్, ఎంఎస్‌డి గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విద్యనభ్యసించండి

**డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టరు శ్రీదేవి**


విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న డిఆర్‌డిఏపిడి

చిత్తూరురూరల్, నవంబరు 1 ప్రభాతవార్త: విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ, అనవసర వ్యాపకాలతో జీవితాన్ని ఇబ్బందుల పాలు చేసుకోకుండా తమలో దాగివున్న నైపుణ్యాన్ని గుర్తించి, తదనుగుణంగా విజయాన్ని సాధించాలని డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టరు శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల నందు డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమంను ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన ఏర్పాటుచేసారు. కళాశాల ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్ మనోహర్, డా.జి. ఉషా రాణిలు మాట్లాడుతూ సావిత్రమ్మ కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ అభివృద్ధిని సాధించిందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ షమ్స్ అక్తర్, అధ్యాపకులు డా. బి, తిరుకుమరన్,డా. వినీల, డా. సంధ్యారాణి, డా. రమాదేవి, డా.ధర్మమూర్తి, డా.శివరాగిణి, డా. వెంకటేశ్వరవ్లు, కుమారి, శివశంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**తాసాపుడ్స్ కంప్యూటర్ ప్రింటర్, యూనిఫాం వితరణ:**

తాసా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం సావిత్రమ్మ కళాశాలకు కంప్యూటర్ ప్రింటర్‌తో పాటు 300మంది విద్యార్థినులకు కళాశాల యూనిఫాంను అందజేసారు. తాసా ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అర్షద్‌హుస్సేన్, మేనేజర్ సమీర్ అహ్మద్‌లు ప్రథమ సంవత్సర విద్యార్థినులకు అభినందిస్తూ కళాశాలలో వున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాజా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంకు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.మనోహర్, వైస్‌ప్రిన్సిపాల్ ఉషారాణిలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మూలాలు కదిలిస్తున్న సిట్

**కల్తీనెయ్యిలో సూత్రధారులు బయటకు వస్తారా!**




తిరుపతి,నవంబర్ 1ప్రభాతవార్త: తిరుమల లడ్డూప్రసాదం తయారీలో కల్తీనెయ్యి వినియోగించారనే సంచలనంపై "ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మలివిడతలో లోతుగా చేపట్టిన విచారణలో సూత్రధారులను తేల్చేపనిలో నిమగ్నమైంది. ఈ బాగోతంలో గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని పూర్వటిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొనుగోలుకమిటీ నిబంధనలు పాటించకుండా అక్రమాలు చేసిందనే ఆధారాలు రాబట్టింది. ఇప్పటికే మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి పిఏ అప్పన్నను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించింది, అతనినుండి సేకరించిన సమాచారంతో ఇక సూత్రధారులను పట్టుకునేందుకు సిట్ చర్యలకు ఉపక్రమిస్తోంది. 2020 నుండి 2024 వరకు ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలనుండి కమీషన్ల రూపంలో ఎవరు తీసుకున్నారు. ఎవరు లబ్దిపొందారు అనే ఆధారాలతో ఇప్పుడు రంగంలోకి దిగారు. కల్తీనెయ్యికి సూత్రధారులు తేల్చేపనిలో మూలాలు కదిలిస్తున్నారు. ఇక గత టిటిడి బోర్డు పెద్దలకు, అధికారులకు నోటీసులు జారీ చేసే దిశగా చూస్తున్నారు. అసలు నెయ్యిసరఫరా చేయాల్సిన డైయిరీ సంస్థలు, కాంట్రాక్టర్ల స్థానంలో ఇతరులు ఎప్పుడు ఎందుకు వచ్చారనేది సూత్రధారుల నుండి రాబట్టాలనే సమాచారం. ఈ కల్తీ బాగోతంలో ప్రొక్యూర్‌మెంట్ అధికారులు తొలి నుండి ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదనేది ఇప్పుడు సిట్ ఆరా తీస్తోంది. దీనివెనుక ఎవరి ప్రమేయం ఉంది.ఎందుకు అంతకాలం మౌనంగా కల్తీనెయ్యినే లడ్డూలకు వినియోగించారనేది ఇప్పుడు సిట్ కీలక దర్యాప్తులో తేల్చనుంది.

### శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్క్‌లో...

# ఒక మగ ఎర్రమెడ వాలబీని మృతి



తిరుపతి క్రీడ, నవంబర్ 1 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్క్‌లో ఒక మగ ఎర్రమెడ గల వాలబీని కోల్పోయినట్లు నివేదించింది. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్క్ అక్టోబర్ 30వ తేదిన అర్థరాత్రి ఒక మగ ఎర్ర మెడ గల వాలబీ మరణించినట్లు ప్రకటించడం తీవ్ర విచారాన్ని కలిగిస్తోంది. అక్టోబర్ 30న ఉదయం నుండి ఆ జంతువు అనారోగ్యంతో, ఆహారం లేకపోవడం గమనించబడింది. పార్క్ యొక్క పశువైద్య బృందం వెంటనే ఇంటెన్సివ్ కేర్‌ను ప్రారంభించింది, సకాలంలో మందులు అందించింది. నిరంతర ప్రయత్నాలు మరియు నిరంతర పర్యవేక్షణ ఉన్నప్పటికీ, వాలబీ పరిస్థితి మెరుగు పడలేదు. అర్ధరాత్రి సమయంలో, ఆ జంతువు తీవ్ర క్షీణతను ఎదుర్కొంది. కార్డియోపల్మోనరీ రిససిటేషన్‌తో సహా అత్యవసర విధానాలు నిర్వహించ బడ్డాయి. కానీ దురదృష్టవశాత్తు అవి విఫలమయ్యాయి. ప్రామాణిక ప్రోటోకాల్ ప్రకారం, మృతదేహాన్ని సమగ్ర పోస్ట్‌మార్టం పరీక్ష కోసం శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలోని పాథాలజీ విభాగానికి తరలించారు. మరణానికి కారణం టాక్సోప్లాస్మోసిస్ అని నిర్ధారించిన డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ పోస్ట్‌మార్టం నిర్వహించారు. పరీక్ష తర్వాత, మృతదేహాన్ని తిరుపతిలోని ఎస్‌వి జూలాజికల్ పార్క్‌లోని పోస్ట్ మార్టం కాంప్లెక్స్‌లో ఖననం చేశారు. గుజరాత్‌కు చెందిన రాధే కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆగస్టు 27, 2025న ఒక జత మీర్‌కాట్స్, ఒక జత కామన్ మార్మోసెట్స్‌తో సహా ఒక జత ఎర్ర మెడ గల వాలబీస్‌ను విరాళంగా ఇచ్చింది. ఈ జంతువులను పార్క్‌లోని ప్రత్యేకమైన సంజీవనిబ్లాక్‌లో ఉంచారు, అక్కడ అవి ప్రామాణిక తప్పనిసరి క్వారంటైన్ వ్యవధిలో ఉన్నాయి. ఈ నష్టం పట్ల ఎస్‌విజడ్పి యాజమాన్యం తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది. ఎడతెగని వర్షాల దృష్ట్యా ఎస్‌వి జూలాజికల్ పార్క్ దాని అన్ని జంతువుల ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తూనే ఉంటుంది. మిగిలిన ఆడ రెడ్‌మెక్డ్ వాలబీ మరియు కొత్తగా వచ్చిన ఇతర జాతులు పరిశీలనలో ఉన్నాయి, ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాయి.

### హాథిరాంజీ మఠాన్ని పాత తరహాలోనే...

# పునర్నిర్మిస్తాం

**- బంజారా భక్తులకు మొదటి ప్రాధాన్యత - జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, నంబరు 1 ప్రభాతవార్త: హాథిరాంజీ మఠంను పూర్వం ఉన్న భవనం లాగా పాత తరహాలోనే పునర్నిర్మిస్తామని, హాథిరాంజీ మఠం నందు బంజారాలకు మొదటి ప్రధాన్యతతో వారికి కావలసిన సదుపాయాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు హాథిరాంజీ మఠం పునర్నిర్మాణం కొరకు ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని స్థానిక తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మరియు ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యలతో కలిసి జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ హాథిరాంజీ మఠం కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి సంబందిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి కమిటీ సూచనల మేరకు మనం ఒక ఎక్స్పర్ట్ కమిటీని నియమిస్తూ వారి యొక్క సూచనలు సలహాలను కూడా తీసుకున్నామని అన్నారు. హాథిరాంజీ మఠం మొత్తంగా కూల్చివేస్తారని అపోహలు నెలకొన్నాయని అలాంటివి అపోహలు పడవద్దని గాంధీ రోడ్డు వైపున ఉన్నటువంటి భాగం మాత్రమే ధ్వంసం అయిందని, హాథిరాంజీ మఠమును మొత్తంగా 10 జోన్లుగా విభజిస్తే అందులో ఉత్తరం వైపున ఉన్నటువంటి రోడ్డు మొదటి అంతస్తు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యాయని తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రసన్న కుమార్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ట్ డైరెక్టర్ ఆర్.ఎస్,ఎస్ మూర్తి విజయవాడ వారు తెలిపారన్నారు. అందులో ఉత్తరం వైపు ఉన్న రోడ్డు, గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు పూర్తిగా ధ్వంసమయ్యాయని, అలాగే కారిడార్ కూడా ధ్వంసమయిందని రూఫ్ కూడా చాల వరకు పాడయిందని అన్నింటిని కూడా పునర్నిర్మాణం చేయవచ్చని పరిశీలించి తెలిపారన్నారు. పూర్వం దీనిని మద్రాస్ టెర్రస్ రూఫింగ్ టెక్నాలజీని ఉపయోగించి నిర్మించారని, అదే తరహాలో ఇప్పుడు పునర్నిర్మాణం చేయవచ్చున్నారని తెలిపారు. ఇందులో కేవలం సున్నపు మోర్టారు, చెక్క, ఇటుకలను మాత్రమే ఉపయోగిస్తారని, ఇందులో సిమెంటు, కాంక్రీటు మరేవి లేవని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం దీనిని రెయిన్ ఫారెస్ట్ సిమెంట్ కాంక్రీట్ అని పిలుస్తామన్నారు. త్వరితగతిన పునర్నిర్మాణం చేసి బంజారాలకు సంబంధించి భక్తులకు వసతి సౌకర్యం, వ్యాపారస్తులకు కూడా వారి సౌకార్యార్థం దుకాణాలను అందుబాటులోనికి తిసుకోస్తామని తెలిపారు.కావున హంథిరాంజీ మఠంను అధికారులు, సాంకేతిక నిపుణుల సమన్వయంతో పునర్నిర్మించుటకు కావలసిన ప్రతిపాదనలను సిద్ధం చేయవలసినదిగా ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్.డి.ఓ రామ్మోహన్, శ్రీకాళహస్తి ఈ.ఓ బాపి రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేష చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటి మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ నరసింహ చారి, హంథిరాంజీ మఠం ఇంజనీర్, మునిసిపల్ కార్పొరేషన్ ఇంజనీర్ లు, తిరుపతి తహసీల్దార్ సురేష్, పలు రాజకీయ ప్రజా ప్రతినిధులు, దుకాణాదారులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకాళహస్తిలో అవినీతి...

# కనబడదా సిఎం గారూ!

**ఆలయంలో ఒక రోజు రు.10లక్షలు అవినీతి -కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ సారథ్యంలో ధర్నా**



రాజీవ్‌నగర్‌లో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొట్టంబేడు, నవంబర్ 1 ప్రభాతవార్త: టిటిడిలో జరిగిన అవినీతి ఆరోపణలపై సిట్ వేసిన కూటమి ప్రభుత్వానికి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సాగుతున్న అవినీతి కనబడటం లేదా? సిఎం గారూ! అంటూ మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్ ప్రశ్నించారు. ఆయన సారథ్యంలో శనివారం రాజీవ్‌నగర్ వద్ద కాంగ్రెస్ మద్దతు దారులతో కలసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి సెగ్మెంట్లో పది సంవత్సరాలుగా 20వేల ఎకరాల భూములను దిగమింగారన్నారు. వీటిపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఒక రోజుకు కనీసం రూ.10లక్షలు అవినీతి జరుగుతోందని చింతామోహన్ ఆరోపించారు. నెలకు రూ.3కోట్లు ఆక్రమంగా సంపాదిస్తున్నారని ఏడాదికి రూ.30 నుంచి 40కోట్లు శివయ్యసొమ్ము కొందరిజేబుల్లో చేరుతుందన్నారు.శ్రీకాళహస్తిలో విచ్చల విడిగా సాగుతున్న అవినీతి, ఆక్రమణలు, ఆరోపణలకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎందుకు పెదవి విప్పటం లేదని చింతామోహన్ నిలదీసారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 300 ఇళ్ళు కూర్చారని ఇళ్ళు కూల్చే ~~అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు.కూటమి ప్రభుత్వ అధికారం~~ లోకి ఇచ్చాక శ్రీకాళహస్తిలో అన్ని వినాశనాలే అన్నారు.కాంగ్రెస్ పార్టీ హయాంలో మంజూరు చేసిన మన్నవరం బెల్ ప్రాజెక్టుమూసి వేతకు మోదీ ప్రభుత్వం సహకరించిందన్నారు.

**రాజీవ్‌నగర్‌ను సంపాదనల కేంద్రంగా మార్చుకుంటున్నారు!**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా రాజీవ్ నగర్ వద్ద 6వేల మందికి ఇళ్ళ స్థలాలను భూములు కొనుగోలు చేసి నిరుపేదలకు అందించారని ఇదో శాటిలైట్ సిటిగా తీర్చి దిద్దారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోల్పోగానే ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత పాలకులు కోట్లు దండుకుంటున్నారని చింతామోహన్ ధ్వజమెత్తారు. గత వైసిపి పానలో ఇదో వ్యాపార కేంద్రంగా మార్చుకున్నారని తమ సొంత ఎస్టేట్‌లా ఇక్కడ ప్లాట్లు పందారం చేసారని ధ్వజమెత్తారు. వైకాపా నాయకులు దండుకున్న సొమ్ములను తిరిగి వసూలు చేసి బాధితులకు ఇవ్వాలని చింతామోహన్ డిమాండ్ చేసారు. ఆయనతో పాటు పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ ఎస్ బత్తెయ్యనాయుడు, నరేంద్రనాయుడు, జనార్ధన్‌రెడ్డి, కూలి రవి,సమీవుల్లా, పెద్ద కృష్ణయ్య, వినోద్,కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోటి సంతకాలతో కూటమికి కనువిప్పు



**శ్రీకాళహస్తి,నవంబర్ 1 ప్రభాతవార్త:** వైకాపా రాష్ట్ర నాయకుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శ్రీకాళహస్తిలోని శ్రీరామ నగర్ కాలనీలో శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి సారధ్యంలో వైద్యకళాశాలలు ప్రైవేటుకు అప్పగించటాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల నుంచి కోటి సంతకాల కార్యక్రమాలలో భాగంగా సంతకాల సేకరణ ప్రారంభించారు. స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆదేశాలతో పార్టీ వర్గాలు కోటి సంతకాల కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కృష్ణారెడ్డితో పాటు బావులూరు అంకయ్య, పసల కృష్ణయ్య, వెంకటేశ్‌నాయుడు, నాగరాజు, కరుణాకర్‌రెడ్డి,సుబ్రమణ్యం, చందు తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు నాటిన జనసైనికులు



**తొట్టంబేడు,నవంబర్ 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు తొట్టంబేడు మండలంలోని నాయకులు పేట చంద్రశేఖర్, చిరంజీవిలు పచ్చదనం కార్యక్రమాలను చేపట్టారు. ప్రతి నెల మొదటి,మూడవ శనివారాల్లో చెట్టు నాటే కార్యక్రమాలను చేపడుతున్నారు. శనివారం కాసరం పంచాయతీలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో చెట్లు నాటారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులుపేట చంద్రశేఖర్, ఎపేట చిరంజీవి,తేజ, ప్రదీఫ్‌కుమార్, నవీన్, మణి, భానుప్రకాష్, మహేష్,దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## దిగువ సాంబయ్యపాళెంలో నో బ్యాగ్‌డే



**తొట్టంబేడు,నవంబర్ 1 ప్రభాతవార్త :** తొట్టంబేడు మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ పాఠశాలలో మొదటి శనివారం నోబ్యాగ్‌డేను నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమ్మూరు బాలసుబ్రమణ్యం విద్యార్థులకు అవగాహన కల్పించుటకు చొరవ తీసుకున్నారు. ఆయన పప్పెట్స్‌తో వినూత్న రీతిలో అభినయం చేస్తూ గేయాలు చెప్పించారు. ఆట పాటలతో బొమ్మలతో విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు.

## మన్నవరంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు



**శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి వచ్చినప్పుటి నుంచి నిరుపేదల సంక్షేమానికి పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని శ్రీకాళహస్తి వ్యవసాయకమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు అన్నారు. శనివారం నిరుపేదల ముంగిటకు పెన్షన్ల పంపిణిదారులు చేరుకున్నారు. మన్నవరం పంచాయతీలోనూ చుట్టుపక్కల దళిత,గిరిజనవాడలకు చెంచయ్యనాయుడుతో పాటు పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది నిమ్మరాళ్ళపల్లిలో పెన్షన్లను పంపిణి చేసారు.

## చుక్కల నిడిగల్లులో వెలుగులు

**శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 1 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు గిరిజన కాలనీలో అంధం కారం వీధి దీపాలు వెలగటం లేదని శనివారం వార్త దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం విదితమే.ఈ విషయం తెలిసిన వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. గిరిజనకాలనీకి వెళ్ళి విద్యుత్ దీపాలను వెలిగించారు. గిరిజనులు వార్త దన్యవాదాలు తెలిపారు.

## ఎన్టీఆర్ భరోస్మా పింఛన్లు పంపిణి



**తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 1 ప్రభాతవార్త :** 34,45 డివిజన్ లోని ఇంటింటికి వెళ్లి పింఛనుదారులకు ఉదయం 6.30 గంటలకు అవ్వ తాతలు, వితంతువులకు మరియు వికలాంగులకు పింఛను సీఎం నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇది మంచి ప్రభుత్వం అని పేదల ప్రభుత్వం అని సంతోషని సచివాలయం సిబ్బంది తో కలిసితెలుగుదేశం పార్టీ బీసీ సాధికారిక రాష్ట్ర కమిటీ సభ్యులు యూనిట్ కన్వీనర్ (తిరుపతి) సత్తు మధుసూదన్ యాదవ్ పింఛన్లు పంపిణీ చేశారు.

## 1100 సేవలను వినియోగించుకోండి : జిల్లా కలెక్టర్



**తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 1 ప్రభాతవార్త :** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ శనివారం ఒక తెలిపారు. ఈ మేరకు మీడియాతో ఆయన మాట్లాడారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీనివాసుడు



**చంద్రగిరి, నవంబర్ 1 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జ్ఞానంతో పాటు నైపుణ్యాలు పెంచుకోండి



పాకాల, నవంబర్ 1 ప్రభాతవార్త : మారుతున్న పోటీ ప్రపంచంలో జ్ఞానంతో పాటు నైపుణ్యాలు కూడా పెంపొందించుకోవాలని ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ సిహెచ్ ఏ రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం తిరుపతి జిల్లా పాకాల మండలం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన దీక్షారామం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్ఈపి 2020 కూడా నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యార్థులు కళాశాల నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు ఈరోజు కొత్తగా ఏమి విషయాలు నేర్చుకొని వెళుతున్నామని ప్రశ్నించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్‌వి రమేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ మాసులామణి అధ్యాపకులు చిట్టి కళావతి, మోహన్ బెహరా, ఈశ్వర్ బాబు, రమణమ్మ, ఆదిశేఖర్ రెడ్డి, రేఖ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీలో పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి



**సత్యవేడు, నవంబరు 1 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలో గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులు చేసిన కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం శ్రీకాళహస్తిలోని సుందరయ్య భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షుడు బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులు చేసిన కూలీలకు సక్రమంగా బిల్లులు చెల్లించడం లేదని 7,8 వారాలు బిల్లుల రాక వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని కూలీలకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు టి.బాలకృష్ణ, ఉపాధ్యక్షులు నలుగురి రమణయ్య, ఆముద, జిల్లా కమిటీ సభ్యులు తిరుపాల్, బాల గురవయ్య, కృష్ణయ్య, శంకరయ్య, మునిశంకర్, రమణయ్య, సుబ్బయ్య, ఆర్.మురుగేష్, దినమని బాలసుబ్రహ్మణ్యం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాల్యంలోనే వికసించిన విజ్ఞాన పుష్పం

**తిరుపతి విద్య,నవంబర్ 1 ప్రభాతవార్త:** బాల్యంలోని టిటిడి ఎస్‌జిఎస్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న మేడా దత్తసాయి చరిష్మా బాలిక ఢిల్లీలో జరిగే సైన్స్ ఎక్స్పోజర్ ఎడ్యుకేషనల్ టూర్‌కు ఎంపికైంది. ఎస్ జి ఎస్ టిటిడి స్కూలుకు చెందిన పదవ తరగతి విద్యార్థిని మేడా దత్త సాయి చరిష్మాను డిఎస్ఓ డిస్టిక్ సైన్స్ ఆఫీసర్ కె.భాను ప్రసాద్ ఎంపిక చేశారు. విజ్ఞానంలో ప్రతిభ చూపుతున్న సందర్భంగా ఢిల్లీకి ఎంపిక అయినందున డిఇఓ టి వెంకట సునీల్, విద్యాశాఖ సూపరింటెండెంట్ సి శివకుమార్ అభినందించారు. అలాగే ఎస్‌జిఎస్ స్కూలు టిటిడి హెడ్మాస్టర్ టి చంద్రయ్య, ఫిజికల్ సైన్స్ టీచర్ బి రెడ్డి నాయక్, ఉపాధ్యాయ బృందము ఆశీర్వదించారు.

## కార్పోరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం పర్యటన



**కుప్పం,నవంబర్ 1 ప్రభాతవార్త:** రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం చిత్తూరు జిల్లాలో సోమవారం ను ంచి చిత్తూరుజిల్లాలో రెండు రోజులు పర్యటి ంచనున్నారు. 3న ఉదయం చిత్తూరుకుచేరుకున్న అనంతరం ఉదయం నుంచి చిత్తూరు మున్సిపల్ కమీషనర్, సిఎంఒ, శానిటేషన్ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం 11గంటలకు పలమనేరు చేరుకుని అక్కడ కూడా మున్సిపల్ కమీషనర్,సిఎంఒ, శానిటేషన్ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం కుప్పం చేరుకున్న అనంతరం 3గంటలకు కడ పి.డి, మున్సిపల్ కమీషనర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, డిపిఒ, ఎంపిడిఓలతో సమావేశం అవుతారు. రాత్రికి కుప్పంలోనే బస చేస్తారు. 4న కుప్పం నుంచి బయలుదేరి పుంగనూరు చేరుకుని అక్కడ మున్సిపల్ కమీషనర్‌తో సమీక్ష జరుపుతారు. అనంతరం మదనపల్లి మీదుగా తిరుపతి చేరుకుంటారు.

## బిసిఎన్ ట్రస్ట్‌చే నీటిశుద్ధి యంత్రాలు వితరణ



**కుప్పం,నవంబర్1 ప్రభాతవార్త:** కుప్పం బిసిఎన్ ఛారిటబుల్ ట్రస్ట్,లయన్స్‌క్లబ్ కుప్పంచే శనివారం నాయనూరు హైస్కూల్‌కు ఇరవై వేల విలువ చేసే నీటిశుద్ధి యంత్రాలను వితరణగా అందించారు. ఈసందర్భంగా బిసిఎన్ గ్రూప్స్‌వైస్‌ఛైర్మన్ సునీల్ రాజ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు తమ ట్రస్ట్‌తరపున అవసరమైన వసతులు కల్పించడం జరుగుతోందన్నారు. లయన్స్‌క్లబ్ సలహాదారు అంబా మహేష్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ నీటిశుద్ధి యంత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. హెచ్‌ఎం రెడ్డి మాధవి దాత సునీల్‌రాజ్‌కు కృతజ్ఞతలుతెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బృందం శివ,పిజి సెల్వం, చరణ్, జయరాం నాయుడు, ఏకాంబరం, సతీష్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళా కార్యకర్త అంత్యక్రియలకు ఆర్థికసాయం



**కుప్పం, నవంబర్ 1ప్రభాతవార్త :** స్థానిక కొత్తపేట 14 వార్డులో ఉంటున్న తెదేపా సీనియర్ కార్యకర్త మునెమ్మ (101)మృతి చెందారు. విషయం తెలుసు కున్న పార్టీ నేతలు వారి ఇంటికి వెళ్లి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా యువనేత, ద్రవిడ వర్సిటీ టిఎన్ఎస్ఎఫ్ మాజీ అధ్యక్షుడు యు.రాహుల్ కుమార్ మునెమ్మ అంత్యక్రియల నిమిత్తం మునెమ్మ కుటుంబీకులకు తనవంతుగా పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు(ముఖేష్), టిఎన్ఎస్ఎఫ్ మునెప్ప, అధ్యక్షుడుసుకుమార్ పాల్గొన్నారు.

## పేదలను ఆదుకుంటున్న వ్యక్తి సిఎం

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం,నవంబర్ 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పేదల కష్టాలు తెలిసి ఆదుకుంటున్న వ్యక్తి సిఎం చంద్రబాబునాయుడు అని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా కంగుంది పంచాయతీలో ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలపైప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ ధనశేఖర్, రాజేంద్ర,కార్యదర్శి శ్రీనివాసులు, మునాఫ్,షరీఫ్,తిరుపతి పాల్గొన్నారు.

## పెన్షన్ల పెంపు ఘనత సిఎం చంద్రబాబుదే : కన్నన్



**కుప్పం, నవంబర్ 1ప్రభాతవార్త:** ఎన్నికలకు ముందు ఇచ్చినహామీ మేరకు పెన్షన్ల సొమ్ము పెంచి ప్రతినెలా 1న అందిస్తున్న ఘనత సిఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని క్లస్టర్ ఇన్‌చార్జ్ కె.కన్నన్ పేర్కొన్నారు. శనివారం 11వ క్లస్టర్ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందించారు. పేదలు సిఎం చంద్రబాబును తమ కుటుంబసభ్యునిగా భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పోరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్ వేలు, మాజీ సర్పంచ్ డికెపల్లి మణి, నేతలు నబీఉల్లా, అల్లాబక్ష్,గనిఉల్లా, నాగభూషణం,షహనాజ్, సోమశేఖర్, మణి,ప్రకాష్,సురేష్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు

## వెంకటస్వామి నాయుడుసేవలు మరువలేనివి



**శాంతిపురం,నవంబర్ 1 ప్రభాతవార్త:** కెనమాకులపల్లి మాజీ సర్పంచ్ దివంగత వెంకటస్వామి నాయుడు సేవలు మరువలేనివని వైకాపా జిల్లాఉపాధ్యక్షుడు కోదండరెడ్డి పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లో నేతలు నడవాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ ఎవి జయరాం, నేతలు విజయ్‌కుమార్, రామూర్తి, మురళీమోహన్‌రెడ్డి, అప్పిరెడ్డి, పళని,శ్రీరాములు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారంకు కృషి చేయాలి



**రామకుప్పం,నవంబర్ 1 ప్రభాతవార్త:** గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంకు పార్టీ నేతలు కృషి చేయాలని నేతలు మునస్వామి,ప ట్రనారాయణ, వెంకటరమణ, నరసింహులు, ఆనందరెడ్డి కోరారు. శనివారం ముద్దనపల్లి, ననియాల తాండా, 89 పెద్దూరు, వీర్నరమల, నారాయణపురం తాండా పంచాయతీల్లో జరిగినసమావేశాల్లో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు ఆంజనేయరెడ్డి,రామూర్తి, గంట ్లప్పగౌడు, సీతాపతి, కృష్ణానాయక్, గుర్రప్ప,రఫీ, కామరాజునాయక్, విశ్వనాథ్,రవిరెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## తెదేపాలోకి వైకాపా నుంచి చేరికలు

**రామకుప్పం,నవంబర్ 1ప్రభాతవార్త:** మండలంలోని కావలిమడుగులో శనివారం వార్డు సభ్యురాలు శ్యామలమ్మ,సామప్ప, శివగామి తదితరులు వైకాపాను వీడి తెదేపాలో చేరారు.కార్యక్రమంలో రెస్కో వైస్‌ఛైర్మన్ విశ్వనాథ్, గ ంట్లప్పగౌడు, ఎస్టీసెల్ అధ్యక్షుడు కృష్ణనాయక్,ఆనంద్‌కుమార్, శ్రీనివాసులుగౌడు, ఉమేష్, బాబు, బాలు, మునెప్ప, శీనప్ప పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఏకాదశి నోములు



**చౌడేపల్లి, నవంబర్ 1 ప్రభాతవార్త** మండల వ్యాప్తంగా ఏకాదశి నోములను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక అభీష్టద మృత్యుంజయే శ్వర స్వామి ఆలయంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితుల ఆధ్వర్యంలో కేదారీ వ్రత మహిమ తెలిపి నోములు నోయించాడు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులో ఆలయం భక్తజన సంద్రమైంది.

## దాతల సహకారంతో తరగతి గది మరమ్మత్తులు



***చౌడేపల్లి, నవంబర్ 1 ప్రభాతవార్త*** దాతల సహకారంతో తరగతి గదికి మరమ్మత్తులు చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయుడు మురళీ తెలిపారు. మండలంలోని పెద్దకొండామర్రి పంచాయతీ కోటూరు ప్రాథమికోన్నత పాఠశాలల గదిలో విద్యార్థులు కూర్చోవడానికి చాలా ఇబ్బందులు పడేవారనీ, గ్రామ పెద్ద మాజీ సర్పంచు పూల చంద్రమౌళి, చౌడేపల్లి పిల్లారి ఏజెన్సీస్ అధినేత పిల్లారి జీవన్ ప్రకాష్‌లచే గదికి మరమ్మత్తులు జరిగాయన్నారు. దాతలకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యోగ విరమణ చేసిన బెంజిమన్‌ను సత్కరించిన ఉన్నం



**తొట్టంబేడు, నవంబర్ 1 ప్రభాతవార్త:** తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్య పాళెంలో సుమారు 41 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడుగా సేవలందించిన మార్టిన్ లూథర్ బెంజిమెన్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమాలను వైకాపా ఉమ్మడి చిత్తూరుజిల్లా ప్రధాన క్యాదర్శి ఉన్నం వాసుదేవనాయుడు సారధ్యంలో ఏర్పాటు చేసారు. బెంజిమెన్ దంపతులను దుశ్శాలువతో సత్కరించారు. పూల మ్యాలలతో ముంచెత్తారు.

## అమరజీవికి నివాళులు



**తొట్టంబేడు,నవంబర్ 1 ప్రభాతవార్త:** తొట్టంబేడు మండల కేంద్రంలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములుకు జనసేన పార్టీ సారధ్యంలో పొట్టి శ్రీరాములకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేట బ్రదర్స్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు భారత దేశంలో చరిత్ర సృష్టించారన్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు పేట బ్రదర్స్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎన్టీఆర్ భరోసా ఫింఛన్ల పంపిణీ



**చిత్తూరురూరల్, నవంబరు 1 ప్రభాతవార్త:** చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 37వ డివిజన్ భాజపా ఇన్‌ఛార్జీ జి.షణ్ముగం సచివాలయ సిబ్బందితో కలసి ఫించన్లను పంపిణీ చేసారు. వార్డు పరిధిలోని వృద్దులు, వితంతువులు, దివ్యాంగుల ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం పేదలకు సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను వివరిస్తూ లబ్దిదారులకు నగదును అందజేసారు. ఈ కార్యక్రమంలో షణ్ముగంతో పాటు కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుఫాను వలన నీటమునిగిన వరి పంట



**కల్లూరు, నవంబర్ 1 ప్రభాతవార్త:** మొంథా తుఫాను ప్రభావంతో పులిచర్ల మండలంలోని పోశంవారిపల్లె పంచాయతీ దిన్నుపాటివారిపల్లె గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారు. గ్రామ చెరువుకు సమీపంలోని పొలాల్లో రైతులు వేసిన వరి పంటలు వర్షాల వలన నీటమునిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట నీటమునగడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రవీంద్రారెడ్డి, రామనాథం, చంగయ్య, కృష్ణమ్మ, అనిత, వేణు, బాధిత రైతులు ఎల్లంకివారిపల్లె వీఆర్వో, మండల వ్యవసాయ అధికారిని కలిసి అర్జీ సమర్పించారు. నష్టాన్ని పరిశీలించి, తక్షణమే ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. రైతుల ఆవేదనపై అధికారులు స్పందించి, అవసరమైన నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని స్థానికులు కోరుతున్నారు.

## కబడ్డీ జట్టు కోసం డివిజన్ స్థాయి ఎంపికలు



**కల్లూరు, నవంబర్ 1 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లూరు నందు కబడ్డీ జిల్లా జట్టుకై చిత్తూరు డివిజన్ లోని 10 మండలాలలో ఇదివరకే మండల స్థాయిలో ఎంపిక కాబడిన విద్యార్థులకు కబడ్డీ పోటీలు శనివారం ఉదయం నిర్వహించారు. ఈ కబడ్డీ పోటీలను మండల విద్యాశాఖ అధికారులు సిద్ధ రామయ్య పోకల తాతయ్య, ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణిలు ప్రారంభించారు. క్రీడలు విద్యార్థులలో క్రమశిక్షణను ధైర్యాన్ని సమస్యలను ఎదుర్కొనే వ్యక్తిత్వాలను పెంచుతాయని ఎంఈవోలు పేర్కొ న్నారు .వ్యాయామ ఉపాధ్యాయులు రెడ్డి ప్రవీణ రాజశేఖర్ వాణి లోకేష్ పవిత్ర ఈ పోటీలను నిర్వహించారు.

## వైభవంగా కార్తీక ఏకాదశి



**పుంగనూరు రూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త :** ఏకాదశి పర్వదినాన్ని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. శనివారం కార్తీక ఏకాదశి తెల్లవారుజామున అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొల్పి ప్రత్యేక పూజలు, అభిషేకం, అలంకరణ, నైవేద్యాలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## పుంగనూరులో అభివృద్ధి కనబడలేదా



**సదుం, నవంబర్ 1 ప్రభాతవార్త :** పుంగనూరు నియోజకవర్గంలో గతంలో జరిగిన అభివృద్ధి తెలుగుదేశం పార్టీ నాయకులకు కనపడలేదా అని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి అన్నారు. శనివారం సదుంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమీ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు పూర్తవుతున్న నియోజకవర్గంలో ఒక్క రూపాయి విలువ చేసే పని చేయలేద న్నారు. సోమలలో కల్వర్టులు తెగిపోయిన ఎంపీ, ఎమ్మెల్యే, స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని టిడిపి నాయకుడు మధుసూదన్ నాయుడు ఆరోపించడం పద్ధతి కాదన్నారు. 200 గ్రాములు అంధకారంలో ఉన్నాయని వాళ్ళు చెప్పడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. వీటిని తెలుగుదేశం పార్టీ నాయకులు గమనిస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్, వైసిపి నాయకులు రమేష్ రెడ్డి,వాసు,గిరిధర్‌రెడ్డి,భాష, శ్రీరాములు ,ఎల్లారెడ్డి, వెంకటరమణ రెడ్డి, రమేష్ ,ఇర్ఫాన్, పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రావణ తొలి ఏకాదశి పూజలు



**సదుం,నవంబర్ 1 ప్రభాతవార్త:** కార్తీక మాసం సందర్భంగా శనివారం మండలంలోని పలు దేవాలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. మతకువారిపల్లె శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో, బూరగ మంద శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, కొత్తపల్లె శ్రీవెంకటేశ్వర పాదాలు ఆలయంలోనూ,సదంలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయంలోనూ, జాం డ్రపేట శ్రీ అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో, వీరభద్ర స్వామి ఆలయంలో స్వామి వాళ్లకు అభిషేకాలు నిర్వహించారు.ఆలయాల్లో భక్తులకు తీర్థప్రసా దాలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే గురజాల



**చిత్తూరురూరల్, నవంబరు 1 ప్రభాతవార్త:** ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను అంధ్రరాష్ట్రంలో అమలుపరుస్తూ రాష్ట్రఅభివృద్ధికి కేరాఫ్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి మార్క్‌గా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు నిలిచారని 32వ డివిజన్ ఇన్‌ఛార్జీ, చిత్తూరు పార్లమెంటరీ కార్యదర్శి బెల్లం సతీష్, ఏపి బిసి సంక్షేమ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి హేమావతిలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆదేశాలతో నగరపాలక సంస్థ కమీషనరు నరసింహప్రసాద్ పర్యవేక్షణలో ఇంటింటా పెన్షన్‌ను పండుగను నిర్వహిస్తున్నారనీ, 32వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో సచివాలయ కార్యదర్శులతో కలసి లబ్దిదారులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అడ్మిన్ కార్యదర్శి యోగేశ్వర్, కార్యదర్శులు హరిక్రిష్ణ, దీప్, శానిటేషన్ మేస్త్రీదేవేంద్ర, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కమాల్. నాగేంద్ర, ఢిల్లీ పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలన లక్ష్యంగా పథకాలు అమలు: వెంకిటీల



**చిత్తూరు, నవంబర్ 1 ప్రభాతవార్త:** సిఎం నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని తెలుగుదేశం ప్రభుత్వం పేదరిక నిర్మూలన లక్ష్యంగా పలు కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తోందని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటవ తేదీన పేదల సేవలో ప్రభుత్వం అనే కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి సూర్యోదయంకు ముందే పెన్షన్ లబ్దిదారుల ఇళ్ళకు వెళ్ళి వారికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, ఇతర తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గౌరవ దివాస్



**చిత్తూరు, నవంబర్ 1 ప్రభాతవార్త:** కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌డే హాలులో శనివారం జాతీయ గౌరవ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు, గాము ఘట్టందొర, బోనంగి పాండు పడల్, కుడుముల పెద్దయ్యన్న హనుమంతప్ప చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఆదివాసీ స్వాతంత్ర్య పోరాటానికి జెండా పట్టిన ధీశాలి బిర్సా ముండా అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు వి.రాజ్‌కుమార్, దేవరాజులు, శంకర్‌మాదిగ, ధనశేఖర్,శేషాద్రి,మునస్వామి,జిల్లాబిసీసంక్షేమశాఖ అధికారిరబ్బానీభాషా,ఇతరఅధికారులు,పాల్గొన్నారు.

## ఫ్యాక్టరీల్లో ఆత్మీయ సమావేశాలు

**చిత్తూరుహెల్త్, నవంబర్ 1 ప్రభాతవార్త:** జిల్లాలోని మామిడి పల్ప్ ఫ్యాక్టరీలు ఈ సీజన్‌లో ఫ్యాక్టరీలకు మామిడి సరఫరా చేసిన రైతులందరికీ ఒక కేజీ మామిడికి రూ.8 చెల్లించాలని ఫ్యాక్టరీల్లో రైతులతో కలిసి ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మామిడి రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు హరిబాబు, ప్రధాన కార్యదర్శి ఆనందనాయుడులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గుడిపాల మండలంలోని తానా పల్ప్ ఫ్యాక్టరీ, బుధవారం జిడినెల్లూరు మండలంలోని జైన్ ఫ్యాక్టరీ, శుక్రవారం బంగారుపాళ్యం మండలంలోని సన్‌గోల్డ్ పల్ప్ ఫ్యాక్టరీల్లో సంబంధిత రైతులతో కలిసి ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో మామిడి రైతులకు కేజీకి రూ.8 చెల్లించేలా ఫ్యాక్టరీ యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకువస్తామని వారు పేర్కొన్నారు.

## ప్రారంభమైన డైరీలు, క్యాలెండర్ల అమ్మకాలు



**నారాయణవనం, నవంబర్ 1 ప్రభాతవార్త :** నారాయణవనంలో ప్రసిద్ది చెందిన పద్మావతీదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో నవంబర్ 1 శనివారం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానంకు సంబందించిన(టిటిడి) డైరీలు, క్యాలెండర్లను అమ్మకాలు ప్రారంభమైనది. స్వామి అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు డైరీలు, క్యాలెండర్లనుకొనుగోళుచేయడానికి ఆసక్తి చూపారు.

## మండలంలో పించన్ల పంపిణీ



**రేణిగుంట నవంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలో శనివారం ఎన్టీఆర్ సామాజిక భద్రత భరోసా పింఛన్లు కూటమినేతలు అధికారుల ద్వారా వేగవంతంగా పంపిణీ చేయించారు. ఉదయం 10 గంటల లోపల వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, ప్రభుత్వం నిర్దేశించిన కళాకారులు, వితంతువులు పింఛన్లు అందుకొని సంతోషం వ్యక్తపరిచారు. రేణిగుంట పట్టణంలోని అనేక వీధుల్లో టిడిపి నేతలు, జనసేన నేతలు, బిజెపి నేతలు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. రేణిగుంట గాజులమండ్యం కె.ఎల్.ఎమ్ హాస్పిటల్, జీవాగ్రం, బాలాజీ నగర్ నందు టిడిపి సీనియర్ నాయకులు, గాజుల మండలం మాజీ సర్పంచ్ శ్రీ రాజ్ దగ్గరుండి పింఛన్ల పంపిణీ చేయించారు. సాయంత్రానికి మండలంలో 95.4 శాతం పింఛన్ల పంపిణీ చేశామని ఎంపీడీవో రవిచంద్ర తెలిపారు.

## క్రీడలలో రాణించాలంటే తర్ఫీదు అవసరం:రమేష్



**రేణిగుంట, నవంబర్ 1 ప్రభాతవార్త:** క్రీడలలో రాణించాలంటే బాల్యం నుండి తర్ఫీదు పొందాలని బాలాజీ బాలవికాస్ బాలాజీ బాలవికాస్ చైల్డ్ ఫండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ రాస్ బాలాజీ బాలవికాస్ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇంటర్నేషనల్ సంస్థ ఆర్థిక సహాయంతో మండలంలోని వివిధ రాస్ దత్తత గ్రామాల యువకులు, పిల్లలకు క్రీడా సామాగ్రి వాలీబాల్, క్రికెట్ బ్యాట్లు, షటిల్ రాకెట్లు, స్కిప్పింగ్ రోపులు, నెట్లు, బంతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకుల కంటే క్రీడాకారులకు ప్రపంచ వ్యాప్తంగా ఫాలోయింగ్ ఎక్కువగా ఉందన్నారు. పిల్లలు చిన్నప్పుడు నుండి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో యూత్ కోఆర్డినేటర్ నాగేంద్ర వర్మ, రా సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై తహసిల్దార్ కోరడా



**రేణిగుంట, నవంబర్ 1 ప్రభాతవార్త :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రకృతి సంపద అయిన ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం పిల్లపాలెం స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను తహసిల్దార్ శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకను అక్రమ రవాణా చేయడం, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం, నేరమన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసినా, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను తాహసిల్దార్ కార్యాలయానికి తరలించారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు టిడిపి సాధ్యం : ఎమ్మెల్యే



**కేవీబీపురం, నవంబరు 1 ప్రభాతవార్త:** మండలంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తెలుగుదేశం పార్టీకే సాధ్యమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం కేవీబీ పురం మండలంలో దిగువ పుత్తూరు గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ పంపిణీని శనివారం ఎమ్మెల్యే పింఛన్ దారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు, పక్కా గృహాలు మంజూరు చేస్తామని ముందుగా భూమి ఉన్న ఇంటి స్థలంలో తహసీల్దార్ వద్ద పొజిషన్ సర్టిఫికెట్ తీసుకుంటే ప్రతి ఒక్కరికి పక్కా గృహాలను ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని ఆయన తెలిపారు. దిగువపుత్తూరు పంచాయతీ భవనానికి 32 లక్షల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అలాగే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. టీడీపీ కార్యకర్త పక్షవాత వ్యాధితో బాధపడుతున్న కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాలతి, మాజీ జడ్పీటీసీ శ్రీహరి యాదవ్, మాజీ ఎంపీపీ బాలాజీ, వెంకటేష్, పాలమంగళం రమేష్, భాస్కర్, వీఆర్వో ముని భాస్కర్, కార్యదర్శులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవం త్యాగానికి చిహ్నం



**పుత్తూరు రూరల్, నవంబరు 1 ప్రభాతవార్త:** భాషా ప్రతిపదిక ఏర్పడ్డ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటిదని, తెలుగు ప్రజల ఐక్యతకు, త్యాగానికి, ఆత్మ గౌరవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం చిహ్నంగా మిగిలిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 1వ తేదీన జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం ఆంధ్ర, రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ మన్యం నరసింహులు, సావిత్రి, బాబురావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెలుగులు నింపడమే సంక్షేమం

**పుత్తూరు రూరల్, నవంబరు 1 ప్రభాతవార్త:** ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమ మని రాష్ట్ర వన్నికుల క్షత్రియకార్పొరేషన్ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి అన్నారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా స్థానిక పుత్తూరు మున్సిపాలిటీ 16వ వార్డులో అర్హులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావడంతోనే ప్రజల జీవన ప్రమానాల పెంపునకు మొదటి అడుగు పెట్టిందన్నారు. నగరి నియోజకవర్గ శాసన సభ్యులు గాలి భానుప్రకాష్ అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆనంగి ఆనంద్, వార్డు అధ్యక్షులులక్ష్మణఆచారి, పార్టీ పట్టణ అధ్యక్షులు ఏళుమలై రెడ్డి, బూత్ ఇన్‌చార్జి పాల్ భాస్కర్, 26వ వార్డు ఇన్‌చార్జి లక్ష్మీపతి, క్లస్టర్ కో-కన్వీనర్ అడుసుమల్లి నవీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెన్షన్లు పంపిణి



**శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త:** ఏర్పేడు మండలం గోవిందవరం, ఎండిపుత్తూరు, రాజుల కండ్రిగ, ఆమందూరు, మేర్లపాక పంచాయతీల్లో శనివారం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు సారథ్యంలోఅధికారులు పంపిణి చేసారుప్రభుత్వ నిరుపేదలకు అందిస్తు న్న పథకాలకు సంబంధించి వివరించారు. ఆయనతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జి కేశినేని సుబ్రమణ్యం, సర్పంచ్ భూమతి నాయుడు మాజీ సర్పంచ్ చిరంజీవులు నాయుడు, మహేస్, దొరస్వామి, మురళి, అమందూరు సర్పంచ్ గుణ యాదవ్, పార్లమెంటు బిసి సెల్ ఉపాధ్యక్షులు రాచటి సుబ్రమణ్యం, మేర్లపాక బూత్ ఇన్‌చార్జి కెకె రమణ, మునెయ్య, ముసలి పేడు బూత్ ఇన్‌చార్జి వై.మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణి



**శ్రీకాళహస్తి, నవంబర్ 1 ప్రభాతవార్త :** పట్టణంలోని వాడ వాడల్లో శనివారం పొద్దుపొడవక ముందే నిరుపేదల ఇళ్ళకు ఎన్‌టిర్ భరోసా పెన్షన్లు పంపిణి జరిగింది. 19 వార్డులో పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు సారథ్యంలో పెన్షన్లను అందిస్తూ ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఉపాధి కల్పనకు పరిశ్రమలు, ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న డియస్‌సితో కొత్త ఉపాధ్యాయులను నియమించారని వివంచారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు గోపినాథ్ పాల్గొన్నారు. పంపిణిలో మున్సిపల్ సిబ్బంది తోపాటు సచివాలయ సిబ్బంది సూర్యోదయానికి ముందే పెన్షన్లను అందించారని కమిషనర్ వివరించారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆకాశ దీపం



**శ్రీకాళహస్తి, నవంబర్ 1 ప్రభాతవార్త :** కార్తీక మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వ రాలయం భక్తులతో కళ కళ లాడుతుంది. ఈ నేపధ్యం లో శనివారం రాత్రి ఆలయ ఆవరణలో ఆకాశ దీపం ఆవిష్కరణ కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ నేపధ్యంలో శనివారం ఆకాశదీపాన్ని ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్, ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి సతీమణిలు ముఖ్యఅతిధులుగా హాజరై అధిరోహింపజేసారు. ఏర్పాట్లను ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, దఫేదార్ దామోదరం పర్యవేక్షించారు. తరువాత చైర్మెన్ భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణి చేసారు.

## సంస్కృత వర్సిటీలో మహాకవి కాళిదాసు జయంతి



**తిరుపతి విద్య నవంబర్ 1 ప్రభాతవార్త:** జాతీయ సంస్కృత వర్సిటీలో శనివారం సాహిత్య విభాగం తరపున కాళిదాస విగ్రహం నందు మహాకవి కాళిదాసు జయంతి మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగినది. మొట్టమొదటిగా విశ్వవిద్యాలయం అకాడమిక్ భవనం నుండి కాళిదాస విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి కాళిదాసుని విగ్రహానికి పూజలు నిర్వహించి, అనంతరం సదస్సు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.జిఎస్ఆర్ కృష్ణమూర్తి విచ్చేసి మహాకవి కాళిదాసు యొక్క ఔన్నత్యాన్ని వర్ణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళిదాసుని యొక్క జ్ఞాన సాహిత్యం భారతదేశానికి ఒక జ్ఞాననిధి అని ప్రకృతిని ఆరాధించేతత్వం, తల్లిదండ్రుల మనస్తత్వం, నూతన సర్జనాత్మకమైనటువంటి విశ్లేషణ కాళిదాసు యొక్క కృతుల్లో మనం చూడొచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా సాహిత్య విభాగ ఆచార్యులు ప్రొ.జె.బి.చక్రవర్తి వ్యవహరించి కార్యక్రమాన్ని చాలా దిగ్విజయంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శుక్ల, సాహిత్య సంస్కృతి డీన్ ప్రొ.సత్యనారాయణ ఆచార్య, పూర్వపు సాహిత్య సంస్క ృతి డీన్ ప్రొ.లలితా రాణి, సాహిత్య విభాగ అధ్యక్షులు ప్రొ.కె.రాజ గోపాలన్, వర్సిటీలోని సాహిత్య విభాగ అధ్యాపకులు, ఇతర విభాగాల అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగినది.

## శ్రీ జగన్నాథ ఆలయాన్ని సందర్శించిన మృదుల ఠాకూర్



**తిరుపతి విద్య నవంబర్ 1 ప్రభాతవార్త:** భారత ప్రభుత్వ విద్యా శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భార్య మృదుల ఠాకూర్ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం లోని శ్రీ జగన్నాథ ఆలయాన్ని, ఉత్కల పీఠాన్ని సందర్శించారు. వైస్‌ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి సాంప్రదాయ వేద పూర్ణకుంభముతో ఆమెను సాదరంగా స్వాగతించారు. వర్సిటిలో సంస్కృతంతో పాటు ఇతర భారతీయ భాషలను ప్రోత్సహిస్తున్న విధానాన్ని, జగన్నాథ సాహిత్యం జరుగుతున్న పరిశోధనలును ఆయన వివరించారు. ఒడిశా చైర్ డైరెక్టర్ డా.జ్ఞానరంజన్ పండా విశ్వవిద్యాలయంలోని ఒడిశా చైర్ లక్ష్యాలు, కార్యకలాపాలు, విజయాల గురించి ఆమెకు వివరించారు. అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శుక్ల, వర్సిటీ ఇన్చార్జి ఫినాన్స్ ఆఫీసర్ ప్రొ.రాధాగోవింద త్రిపాఠి, సాహిత్య సంస్క ృతి డీన్ ప్రొ. సత్యనారాయణ ఆచార్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు



**తిరుపతి విద్య, నవంబర్ 1 ప్రభాతవార్త:** స్థానిక భవాని నగర్‌లోని గీతం జూనియర్ కళాశాలలో బెంగళూరుకి చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ వారు ఇంటర్మీడియట్ పూర్తి అయిన విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొట్ట మొదటిసారిగా తిరుపతిలో ఇంటర్మీడియట్ పూర్తి అయిన విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పెన్షన్ల పంపిణీలో నిర్లక్ష్యం తగదు..! : ఆర్‌డిఓ రామ్మోహన్

**రామచంద్రాపురం, నవంబర్ 1 ప్రభాతవార్త:**



ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో నిర్లక్ష్యం తగదని స్పెషలాఫీసర్, తిరుపతి ఆర్‌డిఓ రామ్మోహన్ అన్నారు. శనివారం రామచంద్రాపురం, ఎస్టీ కాలనీలో ఆర్‌డిఓ చేతుల మీదుగా లబ్దిదారులకు పెన్షన్లు అందజేశారు. కుప్పంబాదూరు, వడ్డికాల్వలో డిఆర్‌డిఎ పిడి టిఎన్ శోభన్‌బాబు పించన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అందించే ఎన్టీఆర్ భరోసా పించన్లను 1వ తారీఖు క్రమం తప్పకుండా ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్‌రావు, టిడిపి నాయకులు తానికొండ కేశవులు నాయుడు, కొట్టే నరశింహారెడ్డి, కోరా హరిప్రసాద్, పుసుపులేటి విజయ్ కుమార్, లెక్కల సురేంద్ర నాయుడు, ఎపిఎం గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం : డిఆర్‌డిఎ పిడి

**రామచంద్రాపురం, నవంబర్ 1 ప్రభాతవార్త:**



మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని డిఆర్‌డిఎ పిడి టిఎన్ శోభన్‌బాబు అన్నారు. శనివారం మండల మహిళా సమైఖ్య నందు మహిళా రైతులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ఎఫ్‌టిఓ ఏర్పాటు చేయడం వలన రైతులే గిట్టుబాటు ధర నిర్ణయించుకోవచ్చన్నారు. రైతులు పండించే పంటలు, కాయగూరలు మార్కెటింగ్ కల్పించుకో వచ్చని అన్నారు. రైతులకు కావలసిన యాం త్రీకీకరణ వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ పొంది తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం గురుమూర్తి, ఎఫ్‌డిఓ అధ్యక్షురాలు లక్ష్మి, సిసిలు పార్వతి, సుధాకర్, అరుణ, అకౌంటెంట్ స్వర్ణలత, పాల్గొన్నారు.

## ఈ నెల 5న కార్తీక దీపోత్సవం : ప్రతాప్ స్వామీజీ

**రామచంద్రాపురం, నవంబర్ 1 ప్రభాతవార్త:**



యోగుల పర్వతంపై ఈ నెల 5న బుధవారం నిర్వహించే కార్తీక పౌర్ణమి పర్వదిన దీపోత్సవంలో పాల్గొనాలని ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ పిలుపు నిచ్చారు. శనివారం రామచంద్రాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 6 అడుగుల ఎత్తైన దివ్యదీపం (కొప్పెర) 1503 కేజీల నెయ్యి, 2 వేల మీటర్ల వత్తితో కార్తీక దీపాన్ని వెలిగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యోగుల పర్వతం పైకి విచ్చేసే భక్తులకు త్రాగునీరు, ఆహారం, అవసరమైన సదుపాయాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ దివ్య దీపం ధర్మం, భక్తి, లోక కల్యాణం వంటి వాటిని ప్రతిబింబిస్తుందని వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించి, మహాశివుడి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## వెంకటేశ్వరునికి తిరుచ్చి వాహనసేవ



**వడమాలపేట, నవంబరు 1 ప్రభాతవార్త:** అప్పలా యగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం సాయంత్రం ఊంజల్‌సేవ, తిరుచ్చి వాహన సేవలు ఘనంగా జరిగాయి. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్య కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవిలతో పాటు స్వా మివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువు దీర్చిగా స్వామివారు గంటపాటు ఊయలలుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి వేణుగో పాల్, ఆలయప్రధానఅర్చకులుసూర్యకుమారాచార్యులు, షరాబు, అర్చకులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుచ్చిపై ఊరేగిన శ్రీరామచంద్రమూర్తి



**నారాయణవనం, నవంబర్ 1 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణ వనం మేజర్ పంచాయతీలో ప్రసిద్ది చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని కార్తీక తెప్పోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమైనది. అయితే రాత్రి సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి వారు సమీపంలోని తామరగుంట పుష్కరణీలో తెప్పపై ఊరేగించాల్సి వుంది. అయితే తామరగుంట ప్రాంతంలో ఓ వ్యక్తి మృతి చెందడంతో స్వామి, అమ్మవారి అలంకరించి తిరుచ్చిపై గ్రామ వీధుల్లో ఊరేగించి ముగించారు. ఉదయం సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తికి స్నపన తిరుమంజనం, అభిషేకం, అలంకరణ చేశారు. ఆదివారం రాత్రి 7గంటలకు యధావిధిగా తెప్పోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఆలయ పర్యవేక్షకులు నాగరాజు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## ఆదర్శ గ్రామాల దిశగా అడుగులు

### – ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనపై జడ్పి సిఈవో శిక్షణ



**తిరుపతిరూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద ఎంపికైన గ్రామాల అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తూ జిల్లా పరిషత్ సిఈఓ రవికుమార్ నాయుడు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం తిరుపతిరూరల్ మండలం ఎంపిడిఓ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి ఆదర్శ యోజనలో ఎంపికైన గ్రామాలలో సర్వే ప్రణాళిక తయారీపై శిక్షణ, సమీక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపికైన గ్రామాల్లో సర్వే నిర్వాహణ అవసరాల గుర్తింపు, గ్రామస్థాయి ప్రణాళికలు రూపొందించడం అభివృద్ధి చర్యలు వేగవంతం చేయడం వంటి అంశాలపై సిఈఓ సమీక్షించారు. ఈ సమీక్షా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా ప్రతి గ్రామం మోడల్‌గా మారాలని, ఆగ్రామంలోని ప్రతి కుటుంబ అవసరాలను అర్థం చేసుకుని ప్రణాళికలు రూపొందించాలన్నారు. విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు ఉపాధి వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ శిక్షణా, సమీక్షా కార్యక్రమంలో ఎంపిడిఓలు, పంచాయతీ కార్యధర్శులు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## అంకురా హాస్పిటల్స్ తిరుపతి



### – చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం

**తిరుపతి హెల్త్, నవంబర్ 1 ప్రభాతవార్త:** అంకురా హాస్పిటల్స్, అశ్రిత చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అంకురా హాస్పిటల్, తిరుపతిలో కొత్త చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి శాసనసభ్యులు ఆరాని శ్రీనివాసులు, తిరుపతి మేయర్ డా. శిరీషా యాదవ్, తిరుపతి డిఎంఅండ్‌హెచ్ఓ డా. బాలకృష్ణ నాయక్, ఐఏపి అధ్యక్షుడు డా. ఎ. రామకృష్ణ రెడ్డి హాజరయ్యారు. ప్రారంభోత్సవం అనంతరం ఏఏపైయు ఫౌండేషన్, అశ్రిత సీడీసీ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత చైల్డ్ డెవలప్మెంట్ స్క్రీనింగ్ క్యాంప్‌లో పిల్లలకు నిపుణుల సలహాలు, డెవలప్మెంటల్, స్పీచ్, ఆక్యుపేషనల్ మరియు బిహేవియర్ సమస్యలపై ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌హౌస్ కన్సల్టెంట్ల బృందంలో డా. రవి చందర్ (పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్), డా. కె. కవిత మరియు డా. ఎస్. భారతి (చైల్డ్ న్యూరో సైకియాట్రిస్ట్ కన్సల్టెంట్లు), డా. ఎ. వంశీ కృష్ణ (మెడికల్ డైరెక్టర్ పీడియాట్రిషన్), డా. పార్థసారధి, డా. రమణ (పీడియాట్రిషన్లు) పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల అభివృద్ధి ఆరోగ్యం, ప్రారంభ దశ జోక్యం ప్రోత్సహించడంలో అంకురా హాస్పిటల్స్ కట్టుబాటు మరోసారి స్పష్టమైంది, ప్రతి చిన్నారికి సమయా నుకూలమైన సహాయం అందేలా చేయడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా డెవలప్మెంటల్ స్క్రీనింగ్ అసెస్మెంట్స్, స్పీచ్ లాంగ్వేజ్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ బిహేవియరల్, సైకాలజికల్ కౌన్సెలింగ్ పేరెంటల్ గైడెన్స్, ఎర్లీ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్స్ సేవలు అందించారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 1 ప్రభాతవార్త:** ప్రభుత్వ అందిస్తున్న పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపూష్టి సాధించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో శనివారం ఆంధ్రప్రదేశ్ పర్యాటక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో హోమ్ స్టే బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్‌ల నిర్వహణపై ఔత్సాహిక మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మెప్మా పి డి. ఎప్రాయిమ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్రంలో అనేక స్వయం ఉపాధి పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. అందులో భాగంగానే ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 10వేల హోమ్ స్టే లు రాష్ట్ర ప్రభుత్వం తరపున మహిళా పొదుపు సంఘాల సభ్యులైన మహిళలు నడుపుకొనేందుకు ప్రత్యేక జీవో తీసుకురావడం జరిగిందని చెప్పారు. ఏపీ టూరిజం ఏ.డి. లిజ్వంతి నాయుడు, ఆర్ డి. డాక్టర్ రమణ ప్రసాద్, డి.టి.సి. శ్రీ జనార్ధన్, మెప్మా డీ.పీ.ఎం యు, సిబ్బంది వి. రమణ, .ప్రమీల, జయరామ్, శంకర్, సీ.ఎం.ఎం లు కృష్ణవేణి సోమకుమార్, సి ఓ లు, ఆర్ పి లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాల పటిష్టతకు కార్యాచరణ



**తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దత్తత తీసుకున్న కుటుంబాల పటిష్టతకు కార్యా చరణ రూపొందించాలని జాయింట్ కలెక్టర్ (ఇంచార్జి), నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. పి4 కార్యక్రమం పై శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఆర్.రెడ్డి, సెక్రటరీ శ్యాంబాబు, ప్రతినిధులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దత్తత తీసుకున్న 2వేల కుటుంబాల యొక్క పటిష్టత కు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ ఆఫీసర్ సేతుమాదవ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు అభినందనలు

**తిరుపతి విద్య, నవంబర్ 1 ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన తిరుపతి జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు వక్తృత్వ పోటీలో పాల్గొని జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో పి.శశాంక్, సీనియర్ బైపిసి, మూడవ స్థానంలో డి.నిశాంత్ చక్రవర్తి, జూనియర్ ఎమ్ ఈ సి, నిలిచారు. జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బా రాయుడు ఐపిఎస్ నుండి మొదటి బహుమతిగా రూ.5,000 మూడవ బహుమతి క్రింద రూ. 2,000 నగదును, ప్రశంసా పత్రాలు అందుకొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు, అధ్యాపకులు విజేతలను అభినందించారు.



## విద్యార్థులులో ప్రతిభను వెలికి తీయాలి :డిజిఎం



**తిరుపతి విద్య నవంబర్ 1 ప్రభాతవార్త:** స్థానిక న్యూ ఇందిరా నగర్ లోని నారాయణ పాఠశాలలో శనివారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీఎం కొండలరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు సెమ్-1 ద్వారా తాము నేర్చుకున్న విద్యా విషయాలను స్పష్టంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఆటలు పోటీలు నిర్వహించారు. అనంతరం ఏజీఎం శ్రీనివాసులు విద్యార్థులు ప్రతిభను వెలికి తీయటానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ వసంత్, ఆర్ ఎన్ డి నీలిమ, ప్రిన్సిపాల్ హిమజ, కోఆర్డినేటర్ దాక్షాయని, ఏడి రామ్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైస్ చైర్మన్‌ను కలిసిన నారాయణ గౌడ్

**తిరుపతి విద్య, నవంబర్ 1 ప్రభాత వార్త:** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండల వైస్ చైర్మన్ ఆచార్య



విజయభాస్కరరావును బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణగౌడ్ మంగళగిరిలోని వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించే విధంగా శ్రీవారి ఆశీస్సులు ఉండాలని తెలియజేశారు.

**CHANGE OF NAME**

● **I, D. SHIVA KUMAR,** Aged about 41 Years, S/o Late Dharman, Residing at Kullaganuru Village, Veernamala Post, Rama Kuppam Mandal, Chittoor District, A.P. In my passport No: F5699807 my Name mentioned as D.kumar instead of D.SHIVA KUMAR (New Name). Henceforth, i will be known as **D.SHIVA KUMAR**

**CHANGE OF NAME**

● I,RASHEE SHANKAR (Old Name), R/at DNo: 10-15-52, KK Layout,Tirupati Dt, AP, have changed my name as PUTTA RASHEE SHANKAR, W/o PUTTA SHANKAR BABU. Henceforth, I will be known as PUTTA RASHEE SHANKAR (New Name).

## కోట మండలంలో చింతా మోహన్ పర్యటన



కోట, నవంబర్ 1 ప్రభాతవార్త: కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్ శనివారం కోట మండలంలో పర్యటించారు. అందులో భాగంగా సిద్ధవరంలోని బహుజన వేదిక రాష్ట్ర అధ్యక్షులు మీజూరు మాధవ్ నివాసానికి చింతా మోహన్ వెళ్లారు. ఈ నెల 23న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కోటలో భారీ బహిరంగ సభ ఏర్పాటు విషయమై మాధవ్‌తో చింతా మోహన్ చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల మల్లికార్జునరావు, పనబాక హేమంత్, కృష్ణ, నాగరాజు, దయాకర్, విన్నమాల రాజముని, వెంకటయ్య, కేశవ్, కావలి కృష్ణ, రాయపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయం



కోట, నవంబర్ 1 ప్రభాతవార్త: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కోట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం కోట మండలం కొక్కుపాడులో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు భాస్కర్‌రెడ్డి, పలగాటి జితేంద్రరెడ్డిల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు సకాలంలో అందాలన్నదే లక్ష్యమని చెప్పారు. పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

## మత్స్యకారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ



కోట, నవంబర్ 1 ప్రభాతవార్త: మొంథా తుపాను కారణంగా ఐదురోజుల పాటు వర్షాలతో మత్స్య కారులు సముద్రంలోకి వేటకు వెళ్లలేక పోయారు. మత్స్యకార కుటుంబాలను ఆదుకునే క్రమంలో ప్రభుత్వం నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారంచుట్టింది. శనివారం కోట మండలం పెదగోవిందపల్లి పాలెంలో 258 మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కోట మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ ప్రమీల, టిడిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, ఎంపిటిసిలు దారా సురేష్, షంషుద్దీన్, గూడూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు చెంగల్‌రావు, ఎఫ్‌డిఓ రెడ్డినాయక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు



సూళ్లూరుపేట, నవంబర్ 1 ప్రభాతవార్త: పట్టణంలోని చాకలివీధిలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్ చేతులు మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆకుతోట రమేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఆత్మస్థైర్యంతో పాటు భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో తీసుకున్న మంచి నిర్ణయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు సిహెచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం



శ్రీసిటీ (తడ), నవంబర్ 1 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణ వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు సూళ్లూరుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య సూచనల మేరకు తడ మండలం మాంబట్టు పంచాయతీలో శనివారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఇంటింటికి వెళ్లి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైసీపీ నేతలు కామిరెడ్డి నందా రెడ్డి, పాముల పురుషోత్తం, వేమన బోయిన భాస్కర్, శ్రీపతి, జలదంకి వినోద్ రెడ్డి, తిరుమల పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన నేదురుమల్లి



వెంకటగిరి, నవంబర్ 1 ప్రభాతవార్త: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై చర్చించారు. కోటి సంతకాల కార్యక్రమంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఆర్సిపి నాయకులు వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్లు పులి ప్రసాద్‌రెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకుడు సదారెడ్డిలు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్న పెన్షన్లు : చంద్రమౌళి



వెంకటగిరి, నవంబర్ 1 ప్రభాతవార్త :ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కోరుకొండ రామకృష్ణ కురుగొండ్ల రామకృష్ణ సూచనల మేరకు మండలంలోని జంగాలపల్లి గ్రామపంచాయతీ నందు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదల కోసం ప్రతి నెల ఒకటో తేదీ పెన్షన్ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ పంపిణీ అధికారులతో పాటు గ్రామ పార్టీ అధ్యక్షులు పాలూరు పాపయ్య, నాయకులు శివరాత్రి మురళి, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి మురళి, ఈశ్వరయ్య, గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేదు : ఏఎంసీ చైర్మన్



వెంకటగిరి, నవంబర్ 1 ప్రభాతవార్త: రైతులకు కూటమి ప్రభుత్వం యూరియా, ఎరువుల వంటి కొడత లేకుండా పుష్కలంగా అందిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం తెలిపారు. లాలాపేట సొసైటీ ద్వారా రైతులకు యూరియాను పంపిణీ చేశారు. నియోజకవర్గ శాసనసభ సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈరోజు పి.ఎ.సి.ఎస్ చైర్మన్ పప్పు చంద్రమోళి రెడ్డి, గొల్లగుంట వెంకటముని ఆధ్వర్యంలో రైతులకు యూరియాకు సంబంధించిన కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఏ.ఎం.సి చైర్మన్ పులుకొల్లు రాజేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు అవ్వారు సత్య నారాయణ,రైతులకు యూరియా ఎంత మేరకు వాడాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుజాత, చేనేత రాష్ట్ర అసోసియేషన్ డైరెక్టర్ శ్రీరామదాస్ గంగాధరం, ఏఎంసి వైస్ చైర్మన్ సూరి, మాజీ పట్టణ అధ్యక్షులు మంకు ఆనంద్, పిఎసిఎస్ డైరెక్టర్ నక్కల గురు ప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షులు పీ.ఎం శివ నారాయణ,యూనిట్ ఇంచార్జ్ నక్కల వెంకటేశ్వర్లు, మండల రైతు సంఘం అధ్యక్షులు కోదూరు సీనయ్య, బూత్ కన్వీనర్ జమ్మల వెంకటేష్, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో బాలుడికి గాయాలు!

బాలాయపల్లి, నవంబర్ 1 ప్రభాతవార్త: మండలంలోని కయ్యూరు అరిజనవాడకు చెందిన రెండేళ్ల బాలుడు నరసింహ పై వీధి కుక్కల దాడి చేసి గాయపరిచాయి. గాయపడిన బాలుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తల్లిదండ్రులు తరలించారు. వీధి కుక్కలను నివారించాలని గ్రామస్తులు కోరారు. కుక్కల వల్ల వీధుల్లో తిరగలేకపోతున్నట్లు చెప్పారు.

## విద్యార్థులను...తల్లిదండ్రులు ప్రోత్సాహించాలి



వాకాడు, నవంబర్ 1 ప్రభాతవార్త: వాకాడు మండలం లోని కొండూరుపాలెం, తూపిలిపాలెం గ్రామాల్లో శ్రీభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వికాస్ కేంద్రాలను శనివారం ట్రస్ట్ చైర్మన్ కె.కోటేశ్వరరావు సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేషనల్ ఫిషరీష్ డెవలప్ మెంట్ బోర్డు మాజీ సభ్యులు, రాష్ట్ర మత్స్యకార సంఘం అధ్యక్షులు కె.పోలయ్య, తూపిలిపాలెం గ్రామ పెదకాపు మహేంద్ర, కొండూరుపాలెం కాపు యన్నావూరు, గ్రామ పెద్దలు వెంకటేష్, కొండూరు చిన్న వెంకటేశ్వర్లు, ట్రస్ట్ టీచర్లు రజిత, అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

సీఎం చేతులు మీదుగా...

## కోట తహశీల్దార్‌కు పురస్కారం



కోట, నవంబర్ 1 ప్రభాతవార్త: మొంథా తుపాను సమయంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సేవలు అందించిన కోట మండల తహశీల్దార్ కె.జయ జయ రావుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా పురస్కారం లభించింది. ఆ మేరకు శనివారం అమరావతిలో జరిగిన ఉత్తమ పురస్కార కార్యక్రమంలో తహశీల్దార్ పాల్గొని అందుకున్నారు. తహశీల్దార్ జయజయరావు తీరప్రాంతమైన కోట మండలంలో అన్ని శాఖల అధికారుల సమన్వయం చేసుకుని ఆదర్శప్రాయంగా నిలిచారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలను, అధికారులను అప్రమత్తం చేస్తూ వచ్చారు. తిరుపతి జిల్లాలోని ఒక్క కోట మండల తహశీల్దార్ జయజయరావుకే 'తుఫాన్ ఫైటర్' అనే అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులతో పాటు వివిధ పార్టీల నాయకులు తహశీల్దార్‌ను సన్మానించారు.

## చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం : మట్టం శ్రావణీ



గూడూరు రూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి పేర్కొన్నారు. శనివారం గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో పెన్షన్లను పంపిణీ చేశారు. మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ పెన్షన్లు పెంచిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నీటిసంఘం అధ్యక్షులు హేమంత్ రెడ్డి,ఇందుకూరు. శ్రీకాంత్ రెడ్డి, మండల కార్యదర్శి అల్లం కృష్ణయ్య, బూత్ కన్వీనర్ ఉగ్గుమూడి మనోహర్ రెడ్డి, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి వేడిచెర్ల వెంకటేశ్వర్లు, కటికాల వెంకటేశ్వర్లు, మహిళా పోలీసు మంజుల పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ.

శ్రీసిటీ,నవంబర్ 1 ప్రభాతవార్త: తడ మండలం పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ మండల ఎంపీడీవో శేఖర్‌నాయక్ పర్యవేక్షణలో అందించారు. తడ మండలం అండగుండాల పంచాయతీలో టిడిపి నాయకులు పర్వతరెడ్డి కోటిశ్వర్ రెడ్డి ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అదేవిధంగా చర్యలు తీసుకుంటామని కోటిశ్వర్‌రెడ్డి, లబ్ధిదారులకు తెలియజేశారు.

## ఓ వ్యక్తి హత్య కేసులో నిందితుడు అరెస్టు



చిల్లకూరు, నవంబర్ 1 ప్రభాతవార్త : మెగా కంపెనీలోని లేబర్ కాలనీ నందు ఒరిస్సాకి చెందిన కూలీల మధ్య జరిగిన గొడవలో ఒరిస్సాకి చెందిన నర్సింగ్ ఒరంను సమీర్ నాయక్ అనే వ్యక్తి రాడ్ తో తల మీద కొట్టగా తలకి బలమైన గాయం తగిలి చికిత్స పొందుతూ చనిపోయాడు. చిల్లకూరు పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు పరిచి, గూడూరు రూరల్ సిఐ కిషోర్ బాబు, ఎస్ఐ సురేష్ బాబులు దర్యాప్తు చేసి, ముద్దాయిని చిల్లకూరు పోలీస్ స్టేషన్ నందు గూడూరు రూరల్ సిఐ అరెస్ట్ చేసారు.

## నిత్యవసర సరుకులు పంపిణీ



చిల్లకూరు, నవంబర్ 1 ప్రభాతవార్త : తుఫాను బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల సహకారం తోతిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ వారి ఆదేశాల మేరకు గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్, పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ తానంకి నానాజీల సూచనలతో తిక్కవరం పంచాయతి గిరిజన కాలనీ వాసులు ముంథా తుఫాన్ సమయం లో పునరావాస కేంద్రంలో ఉన్న 75 కుటుంబాల వారందరికీ నగదు, 25 కేజీల బియ్యం, 1 కేజీ చక్కెర, 1 కేజీ వంట నూనె, 1 కేజీ కందిపప్పు, 1 కేజీ ఎర్ర గడ్డలు, 1 కేజీ ఉర్లగడ్డలు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, తిక్కవరం సర్పంచ్ ఓడూరు సతీష్ రెడ్డిల ఆధ్వర్యంలో పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో తిక్కవరం విఆర్ఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సుభాషిణి, ఉప సర్పంచ్ ఆవుల ప్రభాకర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం : ఎమ్మెల్సీ





చిల్లకూరు, నవంబర్ 1 ప్రభాతవార్త : కోటి సంతకాల సేకరణలో భాగంగా శనివారం చిల్లకూరు మండలం తోనుకుమాల, తిక్కవరం, చెడిమాల, కలవకొండ గ్రామాలకు సంబంధించి తోనుకుమాల గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు చంద్రబాబు నాయుడు అప్పనంగా కట్టబెట్టడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఇప్పటికే సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండి పడ్డారు. కోవిడ్ సమయంలోనే కాకుండా గత ఐదేళ్లలో సచివాలయ వ్యవస్థ ఎలాంటి సేవలందించిందో ప్రజలందరికీ తెలుసు అన్నారు. అందులో భాగంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తున్నామని చెబుతూ వారికి సంబంధించిన మంత్రులు, ఎమ్మెల్యేలకు, కారు చౌకగా అమ్మేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమాన్ని కూడా దిగ్విజయంగా నిర్వహించి ప్రభుత్వం మెడలు వంచుచుతామన్నారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు మండల కన్వీనర్ యద్దల మధుసూదన్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ మేధావి వర్గం అధ్యక్షులు నందవరం సుబ్బారావు, మాజీ ఎంపిపి దువ్వూరు మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ చక్రపాణి రెడ్డి, బి సి నాయకులు ఉడత శ్రీనివాసులు యాదవ్, చిల్లకూరు మండల యువత విభాగ అధ్యక్షులు ఏంల్లటీ సనత్ కుమార్ రెడ్డి, చిల్లకూరు మండల రైతు విభాగ అధ్యక్షులు బుజ్జాయి నాయుడు, తదితర నాయకులు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం బిల్లులను చెల్లించండి




శ్రీకాళహస్తి,నవంబర్ 1 ప్రభాతవార్త : ప్రభుత్వ మాటలు నమ్మి ఉపాధి హామీ పనులు చేసిన కూలీలు చెల్లింపుల్లేక తల్లడిల్లుతున్నారని పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం డిమాండ్ చేసింది.శనివారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పనులు చేసిన కూలీలు పస్తులతో గడుపుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారించటం తగదన్నారు.8 వారాల నుంచి బిల్లులు రాక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు.గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సబంధించి సామాజిక తనిఖీల్లో వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసారు.అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలకు న్యాయం చేయాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీపథకంలో ఏడాదితో 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేసారు.జిల్లాలో అక్రమంగా అన్యాక్రాంతమైన అసైన్‌మెంట్ భూములపై సమగ్ర విచారణ జరపాలని అక్రమార్కుల చేతుల్లో ఉన్న డికేటి భూములను ఎపేదలకు పంచాలని డిమాండ్ చేసారు. డికేటిలు పొంది నేటికి సాగులో లేని భూముల పట్టాలను రద్దు చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమాల్లో సంఘం జిల్లా అధ్యక్షులు టి.బాలకృష్ణ, ఉపాధ్యక్షులు రమణయ్య, ఆముద,జిల్లా కమిటి సభ్యులు తిరుపాల్, బాలగురవయ్య, కృష్ణయ్య, శంకరయ్య, మునిశంకర్,జేకె రమణయ్య, సుబ్బయ్య, ఆర్.మురుగేశం, దినమని, బాలసుబ్రమణ్యం,రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికనగరంలో అడుగడుగునా భక్తిభావం

**-భక్తిని చాటిచెబుతున్న నగరసంకీర్తన**



తిరుపతి, నవంబర్ 1 ప్రభాతవార్త: ఆధ్యాత్మిక నగరం, శ్రీవారి పాదాలచెంత తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ప్రతి శనివారం ఉదయం నిర్వహించే నగర సంకీర్తన భక్తుల్లోనూఆధ్యాత్మిక భావం పెంపొందింప జేస్తోందని రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున నగరసంకీర్తనలో భాగంగా గోవిందరాజస్వామి ఆలయ మాఢవీధుల్లో రంగస్థలి కళాకారులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, వాసుదేవరెడ్డి, భాస్కరాచారి, మురళి, మధు, పద్మావతి, ముని కృష్ణారెడ్డి, గంగప్ప, మునినాథరెడ్డి, అరుణమ్మ, జయమ్మ, సిద్దమ్మ, పద్మావతి, విగ్రహాల కల్యాణి, సుశీల, మునికుమారి, పద్మావతి, కల్పన,ఉషారాణి, పార్వతి, శాంభోలు హరినాథ్, పొన్నాల జేజిరెడ్డి, తదితరులు కళాకారులతో కలసి నుదుటిన నామం ధరించి భక్తితో భజనలతో నగరంలో గోవింద నామ సంకీర్తనలు హోరెత్తాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. నగరసంకీర్తనతో నగరంలో ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తున్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే థామస్



పెనుమూరు, నవంబర్ 1 ప్రభాతవార్త: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో భాగంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ శుక్రవారం రాత్రి మీ ఊరికి మీ ఎమ్మెల్యే థామస్ అనే కార్యక్రమం నిర్వహించి రాత్రి నిద్ర చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే థామస్ స్థానిక ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సిఎం నారా చంద్రబాబునాయుడు శ్రమిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రం అథోగతిపాలైందన్నారు. మండలంలోని గంగుచెరువుకు ఎన్టీఆర్ జలాశయం నుండి నీటిని తరలించడం జరిగిందని, అలాగే జిడినెల్లూరు, పెనుమూరు మండలాల్లో 32 చెరువులను అనుసంధానం చేయడానికి సప్లై ఛానళ్ళ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిఎం చంద్రబాబు నాయుడును కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం కార్యదర్శి వీరపల్లి హరిబాబు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దినేని రుద్రయ్యానాయుడు, నాయకులు పెద్దినేని కృష్ణమూర్తి నాయుడు, తలారి రెడ్డప్ప, పరమేశ్వర్‌రెడ్డి, బాబురెడ్డి, పంగులూరు కిషోర్‌నాయుడు, తులసీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పొట్టిశ్రీరాములు త్యాగం అజరామరం



తిరుపతి, నవంబర్ 1 ప్రభాతవార్త: ఆంధ్రరాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు త్యాగం అజరామరమని బిజెపి నాయకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూజలు చేసి పూలమాలలతో నివాళులర్పించారు. ఆయన త్యాగం ఎప్పటికీ తెలుగు ప్రజలు మరచిపోరని ,ఆయన ఆశయలను సాకారం చేయడానికి మనమంతా కృషి చేయాలని బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, కట్టమంచి చంద్రబాబు యాదవ్, సుబ్రమణ్యం యాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సురేష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇవి రోడ్లా...చెరువులా?



శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 1 ప్రభాతవార్త శ్రీకాళహస్తి మండలంలోని ఆర్‌అండ్‌బికి సంబంధించిన రోడ్లు అధ్వాన్నంగా మారాయి. శ్రీకాళహస్తి–వేడాం మార్గంలోని రోడ్డు చెరువులను మరిపిస్తుంది. గత 15రోజుల పాటు ఎడతెరిపి లేని వర్షాలతో పరిస్థితి అగమ్యగోచరంగా మారంది. ఆమార్గం నుంచి పుణ్యక్షేత్రాలైన కాళికమ్మ ఆలయం, వేయి లింగాల కోన, గుడిమల్లంలకు వెళతారు. నిత్యం వాహనాల రద్దీతో ఉండే రోడ్డు ను బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శాసన సభ్యుడుగా ఉన్నపుడు వేస్ట్‌ల్యాండ్ డెవలప్ మెంట్ పథకంలో కేంద్రం నుంచి నిధులు సాధించి ఫల సాయాన్నిచ్చే చెట్లతో పాటు రోడ్డుల పక్కన చెట్లు నాటించారు.ఈ మార్గంలో చెట్లు హరిత వనాలను మరిపించే విధంగా ఉంటుంది. అటు సువర్ణముఖి నది ఇటు రోడ్డుపక్కల చెట్లతో ఆహ్లాదకరంగా ఉంటుంది.అయితే ఈ మార్గంలో రోడ్డుకు సంబంధించి ఆర్‌అండ్‌బి శాఖ పట్టించుకోక పోవటంతో రోడ్డు అంతా గతుకుల మయంగా మారింది. ప్రస్తుతం ఇది రోడ్డా? లేక చెరువా? అనేది అర్థం కాని పరిస్థితి చోటు చేసుకుంది. చెరువు పక్కన ఉన్న కల్వర్లును మూసివేయటంతో చెరువు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దాంతో రోడ్డు కనబడటం లేదు.దాంతో వాహన చోదకుల అవస్థలు వర్ణనాతీయంగా మారింది.ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ఈ మార్గంలోని వేడాం,మిట్టకండ్రిగ,రామాపురం గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 1 ప్రభాతవార్త: విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన కిన్నెర సాంబ చిన్నయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శించి తనవంతు సహాయంగా బాధిత కుటుంబానికి పదివేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా బాధిత కుటుంబానికి అందవలసిన ఆర్థిక సహాయం పూర్తి స్థాయిలో అందించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే పై స్థాయి అధికారులతో చర్చించి సాంబ చిన్నయ్య భార్యకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

## ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం




తిరుపతి, నవంబర్ 1 ప్రభాతవార్త: భక్తికి నిలయమైన తిరుపతినగరంలో ప్రతినెల మొదటిరోజు ఘంటసాల విగ్రహానికి పూజలు చేయడం రాయలసీమ రంగస్థలి చేపడుతోంది. శనివారం నవంబర్‌నెల ఆరంభాన ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు పాలాభిషేకం చేసి,విశేష పుష్పాంజలి ఘటించారు. అమర గాయకుడు, తెలుగువారి మదిలో చిరస్థాయిగా నిలిచిన ఘంటసాల ప్రతి ఒక్కరికీ ఆదర్శ ప్రాయుడని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి కొనియాడారు. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడని అన్నారు. భవానీనగర్‌కూడలిలో ఉన్న ఘంటసాల విగ్రహానికి రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెవిన్ రాజా, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, వినాయకరెడ్డి, తిరుమలయ్య, ఆదిగురుస్వామి, అన్నారెడ్డి రాజశేఖర్, పురుషోత్తం, సింగంశెట్టి సుబ్బరామయ్య, బ్రహ్మానందరెడ్డి, మధు, కస్పా పద్మనాభం, ఆంజనేయులు తదితరులు పుష్పాంజలి ఘటించారు. ఘంటసాల అభిమాని మునేంద్రారెడ్డిని ఈ సందర్భంగా రంగస్థలి ఘనంగా సన్మానించారు.

## విద్యార్థుల బర్త్ సర్టిఫికెట్‌కు స్టడీ సరిపోదా..?

**ఒత్తిడితో బడిఈడు పిల్లలు బడికి దూరం- ఆందోళనలో ప్రధానోపాధ్యాయులు**

చంద్రగిరి, నవంబర్ 1 ప్రభాతవార్త: ప్రస్తుతం విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు బర్త్ సర్టిఫికెట్‌కు సమానంగా స్టడీ సర్టిఫికెట్ అందజేస్తే సరిపోదా అనే ప్రశ్న అట్టడుగు స్థాయి పేదల నుండి వినిపిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపిఏఏఆర్) పరిపూర్ణమైన సమాచారం ఆధార్‌తో లింకప్ చేయడాన్ని 2024లో ప్రారంభించింది. ప్రారంభ దశలో కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంపై ముఖ్యంగా విద్యాశాఖపై తీవ్రమైన వత్తిడి తీసుకురావడంతో ప్రధానోపాధ్యాయులు ఆఘమేగాలమీద పాఠశాలతోని యూడిఐఎస్‌ఈ (యూనిఫైడ్ డిసిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) పోర్టల్ నందు అందుబాటులో వున్న ఆధార్ ఆధారంగా సమాచారాన్ని అప్‌డేట్ చేసేశారు. పాఠశాలలోని రికార్డులకు, ఆధార్‌లోని సమాచారానికి వ్యత్యాసం వుండటంతో పేరెంట్స్ ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత కొంత కాలంగా ఆధార్ అప్ డేట్ ప్రక్రియకు అంతులేని కష్టాలు ఎదురవుతుండటంతో అనేక మంది విసిగిపోయి తమ పిల్లలను పాఠశాలకు సైతం దూరం చేస్తున్నారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్న కాన్సెప్ట్‌తో ఉపాధ్యాయులు అనేక మంది విద్యార్థులకు పాఠశాలలో ప్రవేశం కల్పించారు. ఈ సమయంలో ఇంటిపేరుతో, లేదా ఇన్షియల్‌తో అడ్మిషన్ చేసుకుంటారు. ఈ సమయంలో సదరు విద్యార్థులకు బర్త్ సర్టిఫికెట్ కోరినట్లయితే ఎక్కడి నుండి తీసుకురాగలరు. ఈ నేపధ్యంలతో బర్త్ సర్టిఫికెట్ కొరకు పేరెంట్స్ తమ పంచాయతీలో ఎన్‌ఓసి తీసుకుని రెవెన్యూ ద్వారా ఆర్‌డిఓను ఆశ్రయించి బర్త్ సర్టిఫికెట్ పొందవలసివుంటుంది. అయితే ఈ ప్రకియ ఎంతటి వ్యయప్రయాలసకు కూడుకున్న విషయమో అందికీ తెలిసిందే. ఈ దుస్థితిను బయటపడాలని భావించిన ఎస్సీ, ఎస్టీలు (ముఖ్యంగా ఎస్టీలు) ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేని పరిస్థితి (కూలీ పనులకు వెళితేగాని పూటగడవని స్థితి) లో తమ పిల్లలను పాఠశాలకు పంపలేకపోతున్నారు. వేల కోట్లతో విద్యావ్యవస్థను నడిపిస్తున్న లక్ష్య సాధనలో ఇటువంటి సాంకేతిక సమస్యలతో తిరిగి విద్యార్థులను బడికి దూరం చేయడం సబబేనా అనే ప్రశ్న వినిపిస్తున్నది. ఈ క్రమంలోనే బర్త్ సర్టిఫికెట్స్ కలిగిన పిల్లలు ఆధార్ అప్‌డేట్, పాఠశాలలోని యూడైస్‌తో వివరాలు సరిపోల్చుకోగా మిగిలిన విద్యార్థులు ఆత్మన్యూనత భావానికి గురై మానసిక క్షభతో పాఠశాలకు దూరమవుతున్నారు. ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర విధానాలు ఒకేవిధమైనవి కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా అపార్‌ను విద్యాశాఖ సమాచారంతో ముడిపెట్టడం వలన నిబంధనల అమలులో వైరుధ్యం తలెత్తుతున్నది. ఈ నేపధ్యంలో ఈ విషయమై ఉన్నత స్థాయి అధికారులు విద్యాశాఖ అధికారులతో సమీక్షించి, పాఠశాలలో నమోదు చేయడిన రికార్డుల ఆధారంగా మంజూరు చేసే స్టడీ సర్టిఫికెట్‌ను ఆధార్ అప్‌డేట్‌కు అనుమతించగలిగితే (ఆధార్ అప్‌డేట్‌కు బర్త్ సర్టిఫికెట్ అనే) జఠిలమైన సమస్యలకు సులభమైన పరిష్కారం లభించగలదు.

## గరుఢవారధిపై బ్లీకింగ్ లైట్లు, రేడియం ఏరోమార్క్స్

తిరుపతి,నవంబర్ 1ప్రభాతవార్త: తిరుపతినగరంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా దేశం నలుమూలల నుండి తిరుమలకు వస్తున్న యాత్రికులు సాఫీగా అలిపిరికి చేరుకునేందుకు వీలుగా అందుబాటులో ఉన్న గరుఢవారధిపై ప్రమాదాల నివారణకు తిరుపతి జిల్లా పోలీసులు చర్యలు తీసుకున్నారు. గరుఢవారధిపై ఇటీవల కాలంలో లక్ష్మీపురంకూడలి సమీపంలో వాహనాలు వేగంగా రావడం, అదుపుతప్పి క్రిందపడి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. తరచూ గరుఢవారధిపై ప్రమాదాలకు కారణమైన మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, కమిషనర్ మౌర్య ప్రత్యేక దృష్టి సారించారు. వారధిపై ప్రమాదాలు నివారణకు సమన్వయంతో మలుపుల వద్ద బ్లీకింగ్ లైట్లు, రేడియం ఏరోమార్క్స్ సూచికలు, బారికేడ్లు వంటివి ఏర్పాటు చేశారు. శనివారం వీటన్నిటినీ ప్రయోగాత్మకంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణమాచారి, తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం,తో కలసి యుద్ధప్రాతిపదికన ప్రమాద నివారణ చర్యలను కొనసాగించారు. ఫ్లైఓవర్‌పై రాత్రిపగలు ట్రాఫిక్ పోలీసులు పహరాకాస్తూ వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తారని ఎస్పీ తెలిపారు. హెచ్చరిక బోర్డులను గమనించి ప్రయాణం సాగించాలని ఆయన కోరారు. గరుఢవారధిపై వర్షం సమయంలో ఎత్తైన ప్రాంతాల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులకు ఎస్పీ సుబ్బరాయుడు సూచనలు చేశారు.